Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 153 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 జూన్ 2023 శనివారం పేజీలు : 4

## పలు రాష్ట్రాల్లో డేంజర్ లెవెల్‌లో ప్రవహిస్తున్న నదులు

న్యూఢిల్లీ: దేశంలోని పలు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీవర్షాలతో వరదలు వెల్లువెత్తడంతో నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లోని డ్యాంలలోకి పెద్ద ఎత్తున వరదనీరు చేరడంతో డేంజర్ లెవెల్ స్థాయికి చేరాయి. పలు రాష్ట్రాల్లో డ్యాంల వద్ద ఫ్లడ్ అలర్ట్ జారీ చేశారు. వరదల వల్ల డ్యాం నీటిని విడుదల చేయడంతో మహారాష్ట్రలోని వసాయి, పాల్ఘార్, దహాను, వడ, విక్రంఘడ్ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

వైతర్నా, పింజాల్ నదులు పొంగి ప్రవహిస్తుండటంతో తాన్సా, మోదక్ సాగర్, కావడాస్, ధామినీ డ్యాంలలోని వరదనీటిని కిందకు విడుదల చేశారు

# ఎన్నికల ముంగిట కేసీఆర్కు అమరులు గుర్తుకొచ్చారే..

# భయమా? భక్తా?





హైదరాబాద్ : మరో ఐదు మాసాల్లో ఎన్నికలు ఉన్న నేపథ్యం లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్కు ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలు గుర్తుకు వస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. అయితే.. ఆయన వీటిని పట్టించుకోకుండానే ముందుకు సాగుతున్నారనుకోండి. ఇప్పటికే బీసీలకు రూ.లక్ష పథకం అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇదిలావుంటే అనూహ్యంగా తెలంగాణ అమర వీరులు కూడా ఇప్పుడు యాదికి రావడం.. మరింత సంచలనంగా మారింది. తాజాగా కేసీఆర్కు.. ఎప్పుడో తెలంగాణ ఉద్యమంలో తనను తాను ఆత్మాహుతి చేసుకుని అమరుడైన శ్రీకాంతాచారి కుటుంబం యాదికి రావడం రాజకీయంగా సంచలనంగా మారింది. మరి ఇది ఎన్నికల సమయంలో అమరులను గుర్తించకపోతే కష్టమన్న భయమో లేక వారిపై ఇప్పటికిప్పుడు ఉప్పొంగిన భక్తో తెలియాల్సి ఉంది.

**ఏం జరిగింది? :** తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతచారి తల్లి శంకరమ్మకు బీఆర్ఎస్ అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఆమెను మంత్రి జగదీశ్వ్రెడ్డి హైదరాబాద్ తీసుకొచ్చారు. అప్పుడెప్పుడో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు ఎన్నికలకు ముందు శంకరమ్మకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గవర్నర్ కోటాలో ఆమెకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వనున్నట్లు ప్రగతి భవన్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. దీనిలో భాగంగానే శంకరమ్మను హైదరాబాద్కు తీసుకొచ్చారని చర్చ నడుస్తోంది. ఎన్నికల ముంగిట అమరవీరుల కుటుంబాలను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో శంకరమ్మకు పదవి కట్టబెట్టి విమర్శలకు ఫుల్ స్టాప్ పెట్టాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సాధారణ ఎన్నికలు కూడా దగ్గర పడుతున్నాయి. ఇప్పటికే అన్ని పార్టీలు ఆ దిశగా సన్నద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో అమరవీరుల కుటుంబాల అంశాన్ని ప్రతిపక్షాలు లేవనెత్తే అవకాశం ఉండడంతో ముందుగానే సీఎం కేసీఆర్ అలెర్ట్ అయ్యారా? అనే చర్చ కూడా సాగుతుండడం గమనార్హం. ఏదేమైనా ఎన్నికలకు ముందు కేసీఆర్ వేస్తున్న అడుగులు ఆసక్తిగా మారాయి.

# కాంగ్రెస్ పార్టీ సర్వే

## తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇలా ఉండొచ్చు!



హైదరాబాద్: కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు తెలంగాణ శ్రేణుల్లోనూ కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తోంది. దీంతో కొత్తగా ఇతర పార్టీల నుంచి నేతలను చేర్చుకుంటూ జోరు చూపిస్తోంది. తాజాగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నిర్వహించింది. ఈ సర్వే వివరాలను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సర్వేలో ఏ పార్టీకి కూడా మెజార్టీ సీట్లు రాకపోవడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ సర్వే ప్రకారం.. బీఆర్ఎస్ పార్టీకి 37 శాతం, కాంగ్రెస్ పార్టీకి 34 శాతం, బీజేపీకి 14 శాతం ఓట్లు వస్తాయని రేవంత్ తెలిపారు. ఇక బీఆర్ఎస్ పార్టీకి 45 సీట్లు, కాంగ్రెస్ పార్టీకి 45, బీజేపీకి 7, ఎంఐఎంకు 7 సీ ట్లు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరో 15 స్థానాల్లో గట్టి పోటీ ఉంటుందని తెలిపారు. గతంలో 24 శాతం ఉన్న బీజేపీ ఓట్ల శాతం 14 శాతానికి పడిపోయిందన్నారు. ఎన్నికల నాటికి ఈ పరిస్థితులు మరింత మెరుగుపడతాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన రాజకీయ వ్యవహారా ల కమిటీ సమావేశం నిర్ణయాలను రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ కన్వీనర్‌గా షబ్బీర్ అలీ బాధ్యత వహిస్తారని చెప్పారు. మండల కమిటీలకు సంబంధించి చాలా ప్రతిపాదన లు వచ్చాయని, పది రోజుల్లో అన్ని మండల కమిటీలు పూర్తి చేస్తామన్నారు. బీసీ డిక్లరేషన్, మహిళా, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డిక్లరేషన్‌పై చర్చ జరుగుతోందని రేవంత్ తెలిపారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర జూన్ నెలాఖరుతో ముగుస్తుండటంతో ఖమ్మంలో జాతీయ నాయకులతో భారీ ముగింపు సభ నిర్వహించాలని ఆలోచన చేస్తున్నామని రేవంత్ తెలిపారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురనాథ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరతారని రేవంత్ రెడ్డి చెప్పారు. మరోవైపు, ఖమ్మంలో కీలక నేతగా ఉన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే.

ఆయనతోపాటు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ నేతలు కాంగ్రెస్ నేతలతో సంప్రదింపులు కూడా జరిపారు.

# కేసీఆర్ దెబ్బకు 'మహా' పార్టీల కు మంట పుట్టేస్తోంది





హైదరాబాద్ : తాను ఒక టార్గెట్ పెట్టుకుంటే..ఆ దిశగా అడుగులు వేసే గులాబీ బాస్ కేసీఆర్ సంగతి మహారాష్ట్ర లోని పార్టీల కు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. మొదట్లో ఆయన్ను లైట్ తీసుకున్నపార్టీలు సైతం.. ఇప్పుడు అందుకు భిన్నంగా ఆయన పై విమర్శల కత్తుల్ని ఝుళిపిస్తున్నారు. ఒక లెక్క ప్రకారం.. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న కేసీఆర్ ఎఫెక్టు ఇప్పుడు మహారాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. డబ్బు ను మంచినీళ్ల ప్రాయంగా వాడేస్తున్న ఆయన తంతు ఇప్పుడు కొత్త చర్చకు తెర తీసింది. తాను గుర్తించిన నేతల కు భారీ ప్యాకేజీల ను ఆఫర్ చేస్తూ.. మహారాష్ట్రలో తన ప్రభావం చూపించటమే లక్ష్యంగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్సీపీ నేత అజిత్ పవార్ లైన్లోకి వచ్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పై ఆయన ఘాటు విమర్శలు చేశారు. మహారాష్ట్రలో పార్టీని విస్తరించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని.. అయితే.. మహారాష్ట్రలో ఏర్పాటు చేస్తున్నపెద్ద పెద్ద హోర్డింగులకు.. టీవీల్లో ప్రకటనల కు ఎక్కడి నుంచి డబ్బులు వస్తున్నాయంటూ ప్రశ్నించారు.

బీఆర్ఎస్ లో చేరుతున్న నాయకుల గురించి పెద్దగా పట్టించుకోవాల్సిందేమీ లేదన్న అజిత్ పవార్.. ఇటు మహా వికాస్ అఘాడీ.. ఇటు బీజేపీ – శివసేన కూటమి లో టికెట్లు దక్కని కొందరు నేతలు ఆ పార్టీలో చేరుతున్నారన్నారు. పైకి బింకంగా గులాబీ పార్టీలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని. ఆ పార్టీ ప్రభావం చూపించదని అజిత్ పవార్ చెబుతున్నా.. నిజం గానే అలాంటి పరిస్థితే ఉంటే.. ఆయన కేసీఆర్ ను లక్ష్యంగా చేసుకొని ఎందుకు విమర్శిస్తారు? అన్నది ప్రశ్నగా మారింది. గతం లో మాయావతి.. ములాయంసింగ్ యాదవ్ లాంటి వారు కూడా మహారాష్ట్రలో తమ పార్టీని ఏర్పాటు చేయాలని ప్రయత్నించి ఫెయిల్ అయినట్లుగా చెప్పుకొచ్చారు. ఎన్సీపీతో పాటు.. శివసేన.. బీజేపీ.. కాంగ్రెస్ నేతలు సైతం మహారాష్ట్రలో గులాబీ పార్టీ ఘాటు వాసనల తో ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్లుగా చెబుతున్నారు. గులాబీ గుబాళింపు మహారాష్ట్రలో షురూ అయినట్లుగా తాజా వ్యాఖ్యల్ని చూస్తే అర్థమవుతుందన్నమాట కారు పార్టీ నేతల నోటి నుంచి రావటం గమనార్హం.



# చేరికలపై రేవంత్ న్యూ స్ట్రాటజీ

హైదరాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్నవేళ తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. కర్ణాటక ఎన్నికల ఫలితాలు ఇచ్చిన ఉత్సాహంతో జోరుమీదున్న టి.పీసీసీ చీఫ్ సరికొత్త వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికే సీనియర్లు – జూనియర్ల మధ్య వర్గవిభేదాలు తెరమీదకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్న రేవంత్... ఇప్పుడు పార్టీ చేరికల పై దృష్టి సారించారు. ఇందులో భాగంగా టార్గెట్ ను కూడా ఫిక్స్ చేసుకున్నట్లు తెలుస్తుంది. తాజాగా రేవంత్ రెడ్డి చేరికల విషయంలో టార్గెట్ నేతల ను ఫిక్స్ చేసుకున్నారు. ఇందులో భాగంగా "ఆపరేషన్ ఘర్ వాపసీ" షురూ చేశారు. అధికార బీఆరెస్ బీజేపీల్లో ఉన్న అసంతృప్త నేతలే టార్గెట్ గా రేవంత్ వర్క్ స్టార్ట్ చేసినట్లు తెలుస్తుంది. ఇప్పటికే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాజీమంత్రి జూపల్లి కృష్ణా రావు లను హస్తం పార్టీలో చేర్చుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆయన... వీరిద్దరికీ రాహుల్ గాంధీ తో భేటీ అరేంజ్ చేసినట్లు సమాచారం! ఇప్పటికే పొంగులేటి జూపల్లి కృష్ణారావు లతో బీజేపీ చేరికల కమిటీ చీఫ్ ఈటల రాజేందర్ రకరకాల ప్రయత్నాలు చేసి విఫలమయిన సంగతి తెలిసిందే. పైగా... వారిరువురు కాంగ్రెస్ లోకి వెళ్లడానికి ఆల్ మోస్ట్ ఫిక్సయ్యారన్నట్లుగా ఈటల లీకులిచ్చారు. దీంతో.. వీరిద్దరు కాంగ్రెస్ పార్టీలో చేరితే.. వీరితో పాటు మరికొన్ని చేరికలు ఉంటాయని రేవంత్ %ం% కో బలంగా నమ్ముతున్నారు. అనంతరం గడిచిన ఎన్నికల ఫలితాల అనంతరం కారు ఎక్కిన నేతల పై కూడా రేవంత్ దృష్టి సారించినట్లు చెబుతున్నారు. బీఆరెస్ లో ప్రతినియోజకవర్గంలోనూ ఒక్కో సీటు కు తక్కువలో తక్కువ ఇద్దరేసి నేతలు టిక్కెట్ల కోసం పోటీపడుతున్న నేపథ్యంలో... అధికార పార్టీ లోని అసంతృప్తులే ఫస్ట్ ప్రిఫరెన్స్ గా రేవంత్ పావులు కదుపుతున్నారంట. అయితే... ప్రస్తుతం సీట్ల సర్దుబాటు విషయంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూనే... చేరికల విషయంలో ఫైనల్ డెసిషన్ కు రావాలని రేవంత్ భావిస్తున్నారని తెలుస్తుంది. ఈ విషయంలో అంతర్గత సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని భావిస్తున్న రేవంత్... ఈ మేరకు చేరికల విషయంలో ఫైనల్ జడ్జిమెంట్ అధిష్టానం పెద్దలకు వదిలేసినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా... దూకుడు మీదున్న టి.కాంగ్రెస్ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ వ్యూహాత్మకంగా చేపట్టిన ఈ "ఆపరేషన్ ఘర్ వాపసీ" ఏ మేరకు సక్సెస్ అవుతుందనేది వేచి చూడాలి.

## సీరియస్ యాక్షన్ షురూ!

# సంపాదకీయం

## టైటానిక్ కోసం వెళ్లి... మరో టైటానిక్ అయ్యేలా ఉందే..!

దాదాపు వందేళ్ల క్రితం అట్లాంటిక్ మహాసముద్రంలో టైటానిక్ షిప్ మునిగిపోయిందనే విషయం తెలిసిందే. అయితే ఆ టైటానిక్ శిథిలాలను పరిశీలించడానికి వెళ్లి ఓ సబ్ మెరైన్ కూడా గల్లంతవ్వడం గమనార్హం. టైటానిక్ శిథిలాలు చూడటానికి ఐదుగురు సభ్యులతో కూడిన ఓ బృందం "టైటాన్ సబ్ మెర్సిబుల్" పేరుతో సబ్ మెరైన్లో సముద్రంలోకి వెళ్లారు. అయితే ఈ సబ్ మెర్సిబుల్ క్రాఫ్ట్ (చిన్నపాటి జలాంతర్గామి) నుంచి కమ్యూనికేషన్ తెగిపోయిందని టూర్ నిర్వాహకులు తెలిపారు. ఓడలో ఒక పైలట్ నలుగురు ప్రయాణికులు ఉన్నారు. మునిగిన నౌకలో బ్రిటన్ దేశానికి చెందిన సాహస యాత్రికుడు హమీష్ హార్డింగ్ పాక్ బిలియనీర్ షాజాదా దావూద్ ఆయన కుమారుడు సులేమాన్ మరో ఇద్దరు పర్యాటకులున్నారు. వీరు సరదా కోసం చేసిన ప్రయత్నం చిక్కులు తెచ్చిపెట్టింది. మహాసముద్రంలో కనిపించకుండా పోయిన టూరిస్టులతో కూడిన సబ్ మెరైన్ కోసం టూర్ నిర్వహణ సంస్థ ఓషియన్ గేట్ కంపెనీతోపాటు ప్రభుత్వం గాలింపు చర్యలు చేపట్టింది. వారిని క్షేమంగా బయటకు తీసుకురావడానికి చాలా శ్రమిస్తున్నారు. ప్రభుత్వ సహాయం తీసుకొని మరీ గాలిస్తున్నారు. అయితే వారు చాలా ప్రమాదంలో ఉన్నరని తెలుస్తోంది. ఎందుకంటే వారి దగ్గర సరిపడా ఆక్సీజన్ కూడా లేదు కేవలం నాలుగు రోజులకు మాత్రం సరిపోయే ఆక్సీజన్ ఉందట. ఓషన్ గేట్ అనే సంస్థ ఇప్పటి వరకు చాలా మందికి టైటానిక్ శిథిలాలను చూపించింది. ఈ విషయంలో ఈ సంస్థ చాలా ఎక్స్‌పర్ట్. 1912లో టైటానిక్ షిప్ మంచు కొండను ఢీకొని అట్లాంటిక్ మహాసముద్రంలో మునిగిపోయింది. అయితే ఈ ఓషన్ గేట్ సంస్థ 2.5 లక్షల డాలర్లు చెల్లించి పర్యాటకులకు ఈ టైటానిక్ శిథిలాలు చూపించడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో ఈ పర్యాటక బృందం కూడా వాటిని చూడటానికి బయటలు దేరింది. న్యూ ఫౌండ్ లాండ్ నుంచి మొదలైన యాత్ర 400 నాటికల్ మైళ్ల దూరంలోని టైటానిక్ శకలాల వద్దకు చేరాల్సి ఉండగా సెయింట్ జాన్స్ కు దక్షిణాన 700 కిలోమీటర్ల దూరంలో ఉండగా కమ్యూనికేషన్ మిస్ అయ్యింది. ఇప్పటి వరకు వారి ఆచూకీ తెలియలేదు. ఈ నౌక సముద్ర అడుగుభాగంలో ఉంటే దీన్ని రక్షించడం అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. దీనిని బయటకు తీయడం కూడా చాలా కష్టమని తెలుస్తోంది. అయితే ఈ టూరిస్టులతో కూడిన సబ్ మెరైన్ ఎప్పుడు గల్లంతైంది అనే విషయాన్ని మాత్రం కంపెనీ ఇంత వరకు వెల్లడించలేదు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# క్వారీల పాపం.. ప్రజలకు శాపం



ఆసిఫాబాద్ : జిల్లాలో ప్రకృతి వనరులను నిలువునా కొల్లగొట్టే విధంగా క్వారీలను ఏర్పాటు చేస్తున్నారు. కనీసం దాని నుంచి వచ్చే ఆదాయంలో నిర్ణీత మొత్తాన్ని అభివృద్ధి పనులకు కూడా కేటాయించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. క్రషర్ల నుంచి కంకర, తెల్లసుద్దను భారీ వాహనాల్లో తరలించే సమయంలో రహదారులన్నీ ధ్వంసమవుతున్నాయి. గనులశాఖకు ఏటా సీనరేజి నిధులు వస్తున్నా, క్వారీలు ఉన్న ప్రాంతాల్లో పైసా ఖర్చు పెట్టకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో కంకర, తెల్లసుద్ద క్వారీలు 25 ఉండగా, ప్రస్తుతం 12 కొనసాగుతున్నాయి. కంకర క్యూబిక్ మీటర్ తవ్వకానికి రూ.65, తవ్విన కంకరను తరలించడానికి రూ.52 గుత్తేదారు గనులశాఖకు సీనరేజి రుసుంగా చెల్లించాలి. తెల్లసుద్ద క్యూబిక్ మీటర్‌కు రూ.52, తరలించడానికి రూ.42 చొప్పున చెల్లించాలి. తెల్లసుద్ద, కంకర క్వారీలకు పరిమితి గడువు ముగిసినా, పర్మిట్లు తీసుకోకున్నా జిల్లాలో యథేచ్ఛగా తవ్వకాలు సాగుతున్నాయి. ఇందులో వాంకిడి మండలంలోని ఇందాని క్వారీ గడువు ఈ సంవత్సరం జనవరిలోనే ముగిసింది. అనుమతి పునరుద్ధరణ కోసం గుత్తేదారు దరఖాస్తు చేసుకున్నారని అధికారులు చెబుతున్నా, గడువు ముగిసిన అనంతరం సైతం రాళ్ల తరలింపు సాగింది. కౌటాల మండలం ముత్యంపేటలో 5 కంకర క్వారీలు ఉన్నాయి. ఒక గుత్తేదారు పరిమితికి మించి తవ్వకాలు జరిపారని, ఈటీసీ సర్వేలో తేలినట్టు సమాచారం.

ఆదాయం వస్తున్నా..

జిల్లా వ్యాప్తంగా ఉన్న క్వారీల నుంచి 2021-22 సంవత్సరానికి రూ.8.24 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు రూ.3.33 కోట్ల ఆదాయం వచ్చింది. ఇవన్నీ జడ్పీ కార్యాలయానికి జమచేశామని అధికారులు అంటున్నారు. వాస్తవంగా ఈ నిధులు క్వారీలు ఉన్న ప్రాంతాల్లో రహదారులు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలి. జిల్లాలో నయాపైసా ఇందుకు వినియోగించడం లేదు. క్వారీల ప్రాంతాల్లో పేలుళ్ల ధాటికి ఇళ్లు బీటలు వారుతుండగా, అనేక బోర్లలో నీళ్లు అడుగంటిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు.


హద్దులు నిర్ధారిస్తాం..: నాగరాజు, గనులశాఖ ఏడీ

క్వారీల సరిహద్దులను నిర్ణయించడానికి వచ్చే నెలలో జీపీఎస్ సర్వేను చేస్తాం. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. సీనరేజి నిధులు రాగానే జడ్పీ ఖాతాలో వేస్తున్నాం. పరిధిని మించి తవ్వకాలు జరిపితే 11 రేట్లు అధికంగా సీనరేజి రుసుం వసూలు చేస్తాం.

అనేకచోట్ల అధ్వానంగా..

కౌటాల మండలం ముత్యంపేట నుంచి పార్ధా గ్రామానికి వెళ్లే మార్గంలో 5 కంకర క్వారీలు, క్రషర్లు ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు కంకర లోడ్‌తో రాకపోకలు సాగిస్తాయి. ఇక్కడి నుంచి నాలుగు వరుసల రహదారికి అవసరమైన కంకరను తేవడం వల్ల కాగజ్‌నగర్-ముత్యంపేట రహదారి సైతం అనేక చోట్ల గుంతలమయం అయ్యింది. గుంతలు ఏర్పడి.. చెరువులను తలపిస్తూ..వాంకిడి వెళ్లే మార్గంలో క్రాస్‌రోడ్ నుంచి ఇందాని వరకు 10 కిలోమీటర్ల రహదారికి రూ.2 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు ఖర్చు చేసి రెండేళ్ల క్రితం తారు రోడ్డు వేశారు. ఇందాని అవతల కంకర క్వారీ ఉంది. ఇక్కడి నుంచి నిత్యం రాళ్లను వాహనాల్లో తీసుకురావడంతో రహదారి అనేక చోట్ల చెరువులను తలపిస్తోంది. కనీసం మరమ్మతులైనా చేయాలని ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వారు డిమాండ్ చేస్తున్నారు. 12 గ్రామాల ప్రజల రాకపోకలతో పాటు మహారాష్ట్రకు వెళ్లే వారికి ఈ దారే దిక్కు.

# వామ్మో.. దుమ్ము



మేడ్చల్ : ఇటీవలి వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసం అయి వాహనదారుల ఇబ్బంది పడుతున్నారు. మొన్నటిదాకా బురదమయంగా ఉన్న రోడ్లు వానలు తగ్గాక దుమ్ము రేగుతున్నాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఘట్‌కేసర్ మండలం వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. అలాగే అక్కడక్కడ ఇసుక పేరుకొని ప్రమాదకరంగా మారింది. చాలాచోట్ల అడుగు లోతుతో గుంతలు పడ్డాయి. గ్రామాల రోడ్లు, అంతర్గత, కాలనీ రోడ్లు సైతం అధ్వానంగా మారాయి. రోడ్లపై మట్టి ఎత్తి వేయించాలని, అలాగే హైవేపై జోడిమెట్ల, నారపల్లి వద్ద జాతీయ రహదారి మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని వాహనదారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కొద్ది రోజులుగా మేడ్చల్ జిల్లాలో కురిసిన వర్షాలతో గుంతలు, బురదమయమైన రోడ్లపై మట్టి పేరుకుపోయింది. ఇప్పుడు వర్షాలు తగ్గడంతో రోడ్లపై వాహనాల రాకపోకలతో భారీగా దుమ్ము లేవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వెళ్లే వారి కళ్లలో, ఒంటిపై అంతా దుమ్ము పడుతోంది. ఎదురుగా వెళ్తున్న వాహనం కనబడనంతగా దుమ్ము లేస్తోంది. ఎండకాలంలో మట్టి రోడ్లపై వెళ్తే ఎంత దుమ్ము లేస్తుందో అదే విధంగా ఇప్పుడు తారు రోడ్లపై లేస్తున్న డస్ట్‌తో వాహనదారులు.. ముఖ్యంగా టూ వీలర్స్ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలు, చౌదరిగూడ పరిధిలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది, ఎక్కడ చూసినా రోడ్లన్నీ అడుగులోతుతో గుంతలేర్పడ్డాయి. అన్ని వాహనాల రాకపోకలకూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జోడిమెట్ల వద్ద పరిస్థితి మరింత ప్రమాదకరంఘట్‌కేసర్ మండల పరిధి జోడిమెట్ల వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిని ఎత్తుపెంచే పని చేస్తున్నారు. ఇందులో భాగంగా కల్వర్టులు, రోడ్డుకిరువైపులా వరదనీరు వెళ్లేలా కాంక్రీట్‌తో కాలువలు కడుతున్నారు. ఈపనులు నాలుగు నెలలుగా నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ముమ్మందు భారీ వర్షాలు కురిస్తే జోడిమెట్ల, నారపల్లి వద్ద హైవేపై ఇబ్బందులు తప్పని పరిస్థితి నెలకొంది. పొంచి ఉన్న ముప్పుభారీ వర్షాలు కురిస్తే చెంగిచెర్ల, పోచారం నుంచి పెద్దఎత్తున వరద వస్తుంది. నారపల్లి, జోడిమెట్ల వద్ద జాతీయ రహదారిపై రెండు, మూడు ఫీట్ల ఎత్తుతో వరద ప్రవహిస్తుంది. గతంలోనూ వరద ప్రభావంతో వాహనాల రాకపోకకు తీవ్ర అంతరాయం ఏర్పడిన సందర్భాలున్నాయి. వర్షాల ముప్పు ఉన్నందున అధికారులు త్వరితగతిన హైదరాబాద్-వరంగల్ హైవేపై ఎత్తు పెంచే పనులు చేయించి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. దుమ్ముతో సతమతంహైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలతో తీవ్రంగా దుమ్ము లేస్తోంది. ద్విచక్ర వాహనదారులు, పాదాచారులుఇబ్బందులు పడుతున్నారు. నారపల్లి నుంచి అన్నోజిగూడ వరకు జాతీయ రహదారిపై పెద్దఎత్తున ఇసుక, దుమ్ము పేరుకుంది. అన్నోజిగూడ వంతెనపై సైతం ఇసుక కొట్టుకొచ్చింది. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోయే ఆస్కారం ఉంది. లారీలు, బస్సులు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు వెళ్లే సమయంలో వెనకుండే వాహనదారులకు రోడ్డు కన్పించలేనంతగా దుమ్ము లేస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడంలేదని వాపోతున్నారు. గుంతలు పూడ్చాలిమున్సిపాలిటీలు, చౌదరిగూడ, మక్త, సాదాత్ అలీగూడ గ్రామాల రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. అన్ని రోడ్లపైనా భారీ గుంతలేర్పడ్డాయి. చౌదరిగూడ-కొర్రెముల్ రోడ్డుపై అడుగుకో గుంత ఉంది. అలాగే కాలనీలు, అంతర్గత రోడ్లు సైతం ధ్వంస మయ్యాయి. ప్రభుత్వం వెంటనే జోడిమెట్ల, నారపల్లి వద్ద జాతీయ రహదారి మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన మరమ్మతులు:- బొక్క సుధాకర్‌రెడ్డి, బొక్కోనిగూడజాతీయ రహదారిపై జోడిమెట్ల, వద్ద రోడ్డు మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో లేస్తున్న దుమ్ముతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తగు చర్యలు తీసుకోవడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నాడు. వాహనదారుల ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదు. పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు దుమ్ము సమస్యను వెంటనే నివారించాలి. ఇసుకతో ప్రమాదం:- వై.దుర్గరాజ్‌గౌడ్, కొర్రెముల్‌రోడ్లపై ఇసుక పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి కిందపడుతున్నా రు. వాహనదారులు గాయాలపాలవుతున్నారు. జాతీయ రహదారిపైనే ఇంతగా ఇసుకు పేరుకుపోతే చిన్న రోడ్ల పరిస్థితి మరి అధ్వానంగా మారింది. వర్షాలు తగ్గగానే రోడ్లను శుభ్రం చేయించకపోవడంతోనే సమస్యలు తీవ్రం అవుతున్నాయి. అధికారులు స్పందించి ఇబ్బందులు తీర్చేలా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రయాణమంటేనే భయమేస్తోంది: - వి.లింగస్వామి, ఎన్‌ఎఫ్‌సీనగర్‌వర్షాలు కురిస్తే బురద, ఎండవస్తే దుమ్ము.. ఇలా రోడ్ల పరిస్థితి ఘోరంగా మారింది. వారం పాటు ముసురు, వానలతో బురద ఏర్పడి ఇబ్బందులు పడ్డాం. వర్షాలు తగ్గాయని అనుకుంటే ఇప్పుడు లేస్తున్న దుమ్ముతో మరో కొత్త సమస్య తలెత్తింది. కారు, బైక్ తీయాలన్నా భయమేస్తోంది. ఏ రోడ్డు చూసినా అడుగడుగునా గుంతలే. వాటిని బాగు చేయించేందుకు అధికారులు, ప్రజాతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. రహదారులన్నీ ధ్వంసం: జి.రమేష్, ఎన్‌ఎఫ్‌సీనగర్‌వర్షాలకు రోడ్లన్నీ ఎక్కడికక్కడ ధ్వంసం అయ్యాయి. జాతీయ రహదారిపై ప్రయాణం అంటేనే భయపడాల్సి వస్తోంది. ఇసుక, బురదతో వాహనాలు జారుతున్నాయి. బ్రేక్ వేసినా అదుపుకాలేని పరిస్థితి ఉంది. ద్విచక్ర వాహనదారులైతే మరింత ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఫీట్ లోతుతో గుంతలేర్పడ్డాయి. ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డును రెండేళ్లగా మరమ్మతులు చేయలేదు. రోజూ ఉద్యోగాలకు వెళ్లే వాళ్లం పాడైన రోడ్లతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నాం.

# కార్యాలయాల కోసం అన్వేషణ

జగిత్యాల : జిల్లాలో కొత్త మండలాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో భీమారం, ఎండపల్లి గ్రామాల కేంద్రంగా రెండు కొత్త మండలాల ఏర్పాటుకు గత నెల 23వ తేదీన ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రెవెన్యూ గ్రామాల ప్రాతిపాదికన మండలాల పునర్విభజనకు ప్రతిపాదించారు. భీమారం, ఎండపల్లి మండలాల కోసం తాత్కాలిక, శాశ్వత అవసరాలు ఏమిటనే దానిపై పరిశీలన చేస్తున్నారు. పూర్వ మండలాల్లో ఉన్న అధికారులు, డివిజన్ అధికారులతో కలిసి అనధికారిక ప్రయత్నాలు మొదలయ్యాయి. ముఖ్యంగా పంచాయతీరాజ్ మినహా మిగితా కార్యాలయాల ఏర్పాటుకు అన్వేషణ మొదలు పెట్టింది. ఇది వరకే ఒక అభిప్రాయానికి వచ్చిన అధికార యంత్రాంగం ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే సంబంధిత ప్రక్రియ పూర్తి చేయాలని యోచిస్తున్నారు. - అభ్యంతరాలు, వినతులు..జిల్లాలోని మేడిపల్లి మండలంలో గల భీమారం, వెల్గటూరు మండలంలో గల ఎండపల్లి గ్రామాల కేంద్రంగా రెండు నూతన మండలాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సుమారు 20 రోజుల క్రితం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. పలు గ్రామాలను కొత్త మండలాల్లో చేర్చుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సంబంధిత నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు, వినతిపత్రాలను స్వీకరించడానికి ప్రభుత్వం పదిహేను రోజుల గడువును విధించింది. సుమారు వారం రోజుల క్రితం వరకు అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. ఆయా మండలాల తహసీల్దార్లు, ఆర్‌డీవోలు, కలెక్టర్ కార్యాలయంలో వినతులను స్వీకరించారు. రెండు మండలాల్లో కలిపి సుమారు పది వరకు అభ్యంతరాలు, వినతులు దాఖలు అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.- మరిన్ని కొత్త మండలాల డిమాండ్...జిల్లాలో రెండు నూతన మండలాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రాథమిక ఉత్తర్వులు జారీ చేయడంతో పలు ప్రాంతాల్లో మరిన్ని కొత్త మండలాల ఏర్పాటు డిమాండ్ తెరపైకి వచ్చాయి. జిల్లాలో మేడిపల్లి మండలం భీమారంను మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించడంతో అదే మండలంలోని మన్నెగూడెం వాసులు తమ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ విస్తృతంగా ఆందోళనలు చేస్తున్నారు. అదేవిధంగా రాయికల్ మండలంలోని అల్లీపూర్‌ను, ఒడ్డెలింగాపూర్‌లను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వచ్చింది. మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్, జగ్గసాగర్ గ్రామాలను సైతం మండల కేంద్రాలుగా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆందోళనలు నిర్వహించడం, వినతి పత్రాలను అందజేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. - ప్రభుత్వ ఆమోదముద్రకు ఎదురుచూపులుపదిహేను రోజుల పాటు అభ్యంతరాలు, వినతిపత్రాలను స్వీకరించిన అధికారులు సంబంధిత వివరాలను తెలియజేస్తూ ప్రభుత్వానికి సంబంధిత ఫైల్‌ను అందించారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వ పెద్దలు తీసుకునే నిర్ణయంపై కొత్త మండలాల ఏర్పాటు ప్రక్రియ ఆధారపడింది. ఎప్పుడైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వీలయితే స్వాతంత్ర దినోత్సవం రోజున గెజిట్ విడుదల చేసే అవకాశాలున్నట్లు సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలిసింది. లేదంటే దసరా పండగ సందర్బంగా నూతన మండలాల ఏర్పాటుకు తుది నోటిఫికేషన్ వెలువడచ్చన్న అభిప్రాయాలూ వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూపులతో గడుపుతున్నారు.- అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన..జిల్లాలో ఏర్పాటు కానున్న రెండు కొత్త మండలాల్లో తాత్కాలిక కార్యాలయాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై ఇప్పటికే డివిజన్, మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయి ప్రాథమిక పరిశీలన చేశారు. ప్రభుత్వ అనుబంధ శాఖల కార్యాలయాల భవనాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడం లేదంటే స్థానిక ప్రజాభీష్టం మేరకు అద్దె భవనాలు గుర్తిస్తున్నారు. దీంతో ఎక్కడెక్కడ కొత్త మండలాల్లో శాశ్వత ప్రాతిపాదికన భవన నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన స్థలాల కోసం అన్వేషిస్తున్నారు. స్థానిక అధికారులు ఇప్పటికే ప్రాథమికంగా భవనాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఏ క్షణం తుది నోటిఫికేషన్ జారీ చేసినా కొత్త మండలాలను ప్రారంభించడానికి అధికారులు సిద్ధమయ్యారు.

# పట్టాలిచ్చేదెప్పుడు?

జగిత్యాల : పోడు భూముల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించి ఎనిమిది నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు వాటిని పరిశీలించి చర్యలు తీసుకోకపోవడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన మొదలయ్యింది. పట్టాలు జారీచేస్తే రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, కేంద్రం అమలు చేస్తున్న ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి పథకాలు వర్తిస్తాయి. అర్హులను గుర్తించి పట్టాలను జారీ చేయకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. అటవీ భూములను పోడుగా మార్చి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులు, గిరిజనేతరులు ఎన్నోఏళ్లుగా తమకు అటవీ భూముల హక్కుల చట్టం (ఆర్‌ఓఎఫ్‌ఆర్) ద్వారా పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఏఏ జిల్లాల్లో ఎన్ని ఎకరాల్లో అటవీ భూములు ఉన్నాయి, ఎంత భూమి కబ్జాకు గురయ్యిందో గుర్తించాలని ఆదేశించారు. - 76 వేల ఎకరాల్లో అటవీ భూములుజిల్లాలో దాదాపు 76 వేల ఎకరాల్లో అటవీ భూములు ఉండగా, వాటిలో 11 మండలాల్లోని 54 గ్రామాల్లో 5074 ఎకరాల భూములు ఆక్రమణకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. గత ఏడాది నవంబర్ 8వ తేదీ నుంచి 16 వరకు దరఖాస్తులను స్వీకరించారు. అందులో భాగంగా జిల్లాలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి, పాలకుర్తి, అంతర్గాం, తదితర మండలాల్లోని 54 గ్రామాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 8,298 ఎకరాల భూములకు గాను 4,614 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 482 మంది గిరిజనులు 980 ఎకరాల భూముల కోసం, 4,132 మంది గిరిజనేతరులు 7,318 ఎకరాల భూముల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలనకు గానూ మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కూడా కమిటీలను వేస్తామని, త్వరగా వాటిని పరిష్కరించి నెలరోజుల్లోనే పట్టాలను జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిచింది. కానీ ఇప్పటి వరకు వాటిని పరిశీలించిన దాఖలాలు లేవు. నిబంధనల ప్రకారం 2005 డిసెంబరు నెలాఖరుకంటే ముందే అటవీ భూములను పోడుగా మార్చుకుని సాగు చేసుకుంటున్న గిరిజనులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం ద్వారా పట్టాలు ఇవ్వాల్సి ఉంది. గిరిజనేతరులు 75 ఏళ్ల నుంచి అటవీ భూములను సాగు చేసుకునే వారికి మాత్రమే పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. అటవీ మధ్యలో భూములను సాగు చేసుకుంటున్న వారికి మరో చోట ప్రభుత్వ భూములను ఇచ్చి సాగు నీరు, విద్యుత్, నివాస సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ భూములు లేకుంటే అటవీ చివరన సరిహద్దు భూముల్లో పట్టాలు జారీ చేయాలని పేర్కొంది. - గిరిజనేతరుల నుంచే అధిక దరఖాస్తులు..జిల్లాలో గిరిజనేతరుల నుంచే అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అర్హత కలిగిన వారి సంఖ్య తక్కువే ఉంటుందని అధికారులు అంటున్నారు. పలువురు ఆయా భూముల్లో కబ్జా లేకున్నా కూడా దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తున్నది.

# తీగల వంతెన ప్రారంభానికి సిద్ధం

కరీంనగర్ : కరీంనగర్ మీదుగా వరంగల్‌కు వెళ్లే వాహనాల రాకపోకలకు దూరాభారం తగ్గించడంతోపాటు ట్రాఫిక్ రద్దీ లేకుండా చేసేందుకు రూ.224 కోట్ల వ్యయంతో నిర్మించిన తీగల వంతెన ప్రారంభానికి సిద్ధమైంది. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి ప్రారంభించనున్నారు. అధికారులు సంబంధిత ఏర్పాట్లు పూర్తి చేశారు.

2018లో పనులకు శ్రీకారం..

2018 ఫిబ్రవరి 19న తీగల వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మొదట రూ.183 కోట్ల వ్యయం అవుతుందని భావించారు. నిర్మాణంలో మార్పులు, భూసేకరణ తదితరాల మూలంగా పూర్తయ్యేసరికి రూ.224 కోట్లకు చేరింది. తీగల వంతెన 500 మీటర్లు, కరీంనగర్ కమాన్ నుంచి వంతెన వరకు 300 మీటర్లు, సదాశివపల్లి వైపు 500 మీటర్ల దూరంలో పనులు పూర్తయ్యాయి. మిగిలిన 3.4 కిలోమీటర్ల వరకు భూసేకరణ చేసి అప్రోచ్ రోడ్లు నిర్మించారు.



పర్యాటకులు సందర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

తగ్గనున్న ఏడు కిలోమీటర్లు..

జగిత్యాల, పెద్దపల్లి, ఆదిలాబాద్, సిరిసిల్ల తదితర ప్రాంతాల నుంచి కరీంనగర్ మానేరు వంతెన రహదారి మీదుగా వరంగల్, విజయవాడకు వెళ్లే వారికి దూరాభారం, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఈ వంతెన ఉపయోగపడనుంది. సుమారు 7 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఆరు కోట్ల వ్యయంతో డిజిటల్ లైటింగ్‌తోపాటు రెండు పెద్ద తెరలను ఏర్పాటు చేశారు. మానేరు రివర్‌ఫ్రంట్ పనులు కొనసాగుతున్నాయి. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వంతెన ప్రారంభంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రమాదాలు జరగకుండా..

కమాన్ నుంచి వంతెన పైకి వెళ్లే ప్రాంతంలో నలు వైపుల నుంచి వాహనాల రాకపోకలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఈఈ సాంబశివ రావు మాట్లాడుతూ.. ప్రమాదాలకు అవకాశం లేకుండా ఇరువైపులా వేగనియంత్రికలు ఏర్పాటు చేస్తామని, నెమ్మదిగా వెళ్లుమనే బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రారంభానికి ఏర్పాట్లు చేశామని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు

# డిజిటల్ బోధనకు సన్నద్ధం



మెట్‌పల్లి : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మౌలిక వసతుల కల్పనకు 'మన ఊరు–మన బడి' కార్యక్రమం కింద అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అలాగే తరగతి గదుల్లో మెరుగైన బోధనకు డిజిటల్ విధానానికి శ్రీకారం చుడుతున్నారు. ఇందుకోసం మొదటి విడత ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. పలు పాఠశాలలకు డిజిటల్ బోధనకు అవసరమైన పరికరాలు సరఫరా చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ బోధన ప్రారంభం కానుంది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను కొంత మంది విద్యార్థులు పూర్తిగా అర్థం చేసుకోలేరు. దృశ్యరూపంలో తెరపై చూపిస్తూ బోధిస్తే సులభంగా అర్థమై వారు గుర్తుంచుకునే అవకాశం ఉంటుంది. ఈ తరహాలో డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం భావించింది. 'మన ఊరు–మన బడి' కింద పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులు చదువులో మెరుగ్గా రాణించేలా ప్రణాళికలు రూపొందించింది. విద్యార్థుల్లో పూర్తిస్థాయిలో విషయ పరిజ్ఞానం పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ విద్యా సంవత్సరం డిజిటల్ బోధనను ప్రారంభిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లోనే 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు డిజిటల్ బోధన చేయడానికి సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో మొదటి విడతలో 104 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. డిజిటల్ బోధనకు అవసరమైన పరికరాలను ఆయా పాఠశాలలకు చేరవేశారు.

దృశ్యరూపంలో పాఠాలు..

డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు దృశ్యరూపంలో పాఠాలు చెప్పనున్నారు. ఇందుకోసం ప్రతి పాఠశాలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)లను అందించారు. మూడు తరగతులకు గాను ప్రతి పాఠశాలకు మూడు ఐఎఫ్‌పీలను పంపిణీ చేశారు. వీటిని 8, 9, 10 తరగతి గదుల్లో అమర్చారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోయినా అంతరాయం లేకుండా ప్రతి ప్యానెల్ కనీసం రెండు గంటల పాటు పనిచేసేలా యూపీఎస్‌ను అందించారు. అలాగే ఎలక్ట్రిఫికేషన్, నెట్‌వర్క్ కిట్లను అందించారు. 75 అంగుళాలున్న ప్యానెల్‌ను రెండు రకాలుగా వినియోగించుకోవచ్చు. డిజిటల్ తరగతుల బోధనతో పాటు బ్లాక్‌బోర్డుగా కూడా వినియోగించుకోవచ్చు. డిజిటల్ బోధనకు ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులకు వాటి నిర్వహణపై త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులకు మేలు

డిజిటల్ విద్యా బోధన అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు పలు రకాలుగా మేలు చేకూరనుంది. సాధారణంగా తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఒకసారి బోధించే పాఠ్యాంశాలను కొంత మంది విద్యార్థులు సరిగ్గా అర్థం చేసుకునే పరిస్థితి ఉండదు. దీన్ని అధిగమించేలా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించిన అనంతరం విద్యార్థులకు డిజిటల్ తెరపై దృశ్యరూపంలో మళ్లీ అవగాహన కల్పిస్తారు. దీంతో చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఉదయపు పోషణ.. భవితకు నిచ్చెన

సిద్దిపేట : ఒక్కో విద్యార్థికి 10 గ్రా.ల చొప్పున రాగి పిండి, బెల్లం మిశ్రమాన్ని నీటిలో మరిగించి 250 ఎం.ఎల్. మేర పంపిణీ చేయనున్నారు. మంగళ, గురు, శనివారాల్లో అందించనున్నారు. మిగిలిన రోజుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఉడకబెట్టిన కోడిగుడ్డు అందించనున్న దృష్ట్యా మినహాయింపు ఇచ్చారు. జులై 1 నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ మొదలు పెట్టేలా కార్యాచరణ రూపొందించారు. తొలుత జిల్లాల్లో 5వేల మందికి చొప్పున అందించనున్నారు. ఇందుకు తగ్గట్టుగా బడులను ఎంపిక చేశారు. నిర్దేశిత రోజుల్లో తరగతుల ప్రారంభానికి ముందే రాగి జావను అందిస్తారు.

ఆయా జిల్లాల్లో.. సిద్దిపేట జిల్లాలో 45 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. ఇప్పటికే 500 కిలోల చొప్పున రాగి పిండి, బెల్లం పొట్లాలు చేరుకున్నాయి. మొత్తంగా జిల్లాలోని 976 పాఠశాలల్లో చదివే 95 వేల మందికి ప్రయోజనం చేకూరనుంది.సంగారెడ్డి జిల్లాలో 500 కిలోల రాగి పిండి పంపిణీ చేశారు. అన్ని పాఠశాలలను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 1.30 లక్షల మందికి ఉదయం వేళ అందిస్తారు. లి మెదక్‌లో 24 పాఠశాలలు ఎంపిక చేశారు. రెండు రోజుల కిందట డీఈవో రాధాకిషన్ ఉపాధ్యాయులకు సదరు పొట్లాలను పంపిణీ చేశారు. ఇందుకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు స్టాక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించనున్నారు.లి వికారాబాద్ జిల్లాలో 45 బడుల్లో ముందగా పంపిణీ చేయనున్నారు. ఇందుకు ఉన్నతాధికారులు ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.

లోపాన్ని అధిగమించేలా..

పోర్టిఫైడ్ రాగి పిండి, బెల్లం మిశ్రమంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. జావ తయారీకి వినియోగించే మిశ్రమంలో రాగి, బెల్లం, సోయా, బియ్యం, దాల్చిన చెక్క, పసుపు, ఉప్పు తదితరవి ఉంటాయి. ఆయా వాటిని పొడిగా చేసి 'సాయి ష్యూర్' పేరిట పొట్లాలను పాఠశాలలకు అందిస్తారు. వీటిలో కార్బొహైడ్రేట్స్, కాల్షియం, మెగ్నీషియం, వివిధ రకాల విటమిన్లు, ఫైబర్లు, ఐరన్ దాగి ఉన్నాయి. విద్యార్థుల ఎదుగుదలకు ఉపకరించనున్నాయి. సక్రమంగా అందిస్తే పోషకాహార లోపం సమస్యను అధిగమించవచ్చు.

బాలల భావి జీవితం.. బంగారుమయం కావాలంటే పోషకాహారం అవశ్యం. ఈ తరుణంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అందుకు అదనంగా వారంలో మూడు రోజులు రాగి జావ అందించాలని సంకల్పించారు. శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 'ఉదయపు పోషణ కార్యక్రమం' అమలుకు చర్యలు చేపట్టారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు.

ముందుకొచ్చి..

పల్లెల నుంచి వచ్చే విద్యార్థులు నీరసపడకుండా ఉండేందుకు చేగుంట మండలం కసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు చొరవ చూపి రాగి జావ అందజేశారు. గత విద్యాసంవత్సరంలో మార్చి మొదలవగానే పంపిణీకి శ్రీకారం చుట్టారు. అర్కమిత్ర ఫౌండేషన్ సహకారం అందించారు. విద్యాసంవత్సరం ముగిసే వరకు పంపిణీ చేశారు. మొత్తం 40 మంది విద్యార్థులు ఉండగా నిత్యం ఉదయం వేళ ప్రధానోపాధ్యాయురాలు సంగీత, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో అంబలి ఇచ్చారు. బడిలోనే తయారు చేశారు.

సిద్దిపేటలో ప్రత్యేకంగా

సిద్దిపేట జిల్లాలో శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరం నుంచే 'ఉదయపు పోషకాహార పానీయ' సేవ పేరిట కార్యక్రమం చేపట్టారు. బెల్లంతో కూడిన రాగి పౌడర్‌తో జావ తయారు చేసి అందించారు. 217 పాఠశాలల్లో 24 వేల మందికి అందించారు. నిత్యం ఉదయాన్నే ప్రార్థనా సమయానికి ముందే పంపిణీ చేశారు. ఇదే స్ఫూర్తిగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి అడుగేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని బడులకు వీరి సహకారంతోనే జావ తయారీ వస్తువులను పంపిణీ చేస్తుండటం గమనార్హం.

# ప్రభుత్వ, పరిశ్రమ భూముల్లో ఆక్రమణలు



గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విలువైన భూములు ఆక్రమార్కుల చేతుల్లో వెళ్తున్నాయి. ప్రభుత్వ భూములతో పాటు పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించిన స్థలాలకు హద్దుల ఏర్పాటు లేకపోవడంతో పాటు పట్టామార్పిడి చేసుకోకపోవడాన్ని కబ్జాదారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. విలువైన భూములను సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. రామగుండం ప్రాంతంలో పేదల అవసరాల కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని కొందరు దళారులు దర్జాగా కబ్జా చేస్తూ విక్రయించుకుంటున్నారు. రహదారి కోసం సింగరేణి సంస్థ సేకరించిన భూమిని దక్కించుకోవడానికి రహదారి వెడల్పును తగ్గించి మరీ మిగతా భూమిని ఆక్రమించుకుంటున్నారు. పేదప్రజల ఇళ్ల కోసం ప్రభుత్వం సేకరించిన 100 ఎకరాల భూమిలో సైతం పాగా వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొందరు అందులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు హద్దులు సైతం ఏర్పాటు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వారి దందాకు అడ్డుకట్ట పడటం లేదు. తాజాగా సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిని కూడా దక్కించుకోవడానికి కొందరు వ్యూహాలు పన్నుతున్నారు.

పేదల ఇళ్లకోసం సేకరిస్తే...

ప్రభుత్వం పేద ప్రజల ఇళ్ల కోసం మేడిపల్లి శివారులో 100 ఎకరాల భూమిని సేకరించింది. ఒక ఎకరాకు రూ.5 లక్షల చొప్పున చెల్లించిన ప్రభుత్వం వంద ఎకరాలు సేకరించి న్యూ పీకే రామయ్యకాలనీ, ఇందిరమ్మకాలనీల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. ప్రస్తుతం అందులో 15 ఎకరాలు ఖాళీగా ఉండటంతో అక్రమార్కులు దానిపై కన్నేశారు. అందులో ఇళ్ల నిర్మాణాలకు స్థలాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మేడిపల్లి శివారులోని 17 సర్వే నెంబర్ల నుంచి వంద ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఒక సర్వే నెంబరులో ఉన్న తప్పును కొంతమంది అనుకూలంగా మలుచుకుని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని ప్లాట్లను విక్రయించిన దళారులు తమ దందాను కొనసాగిస్తున్నారు.రెవెన్యూ అధికారులు కూల్చివేసినా కొద్ది రోజులు దందాను నిలిపివేసి మళ్లీ మొదలు పెడుతున్నారు. దీంతో విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయి.

రహదారి పక్కన...సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిని సైతం అక్రమార్కులు వదలడం లేదు. వంద ఫీట్ల రహదారి నిర్మాణం కోసం సింగరేణి సంస్థ 13.12 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి సేకరించిన భూమికి పరిహారం చెల్లించింది. పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో ఆ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. మేడిపల్లి నుంచి రామగుండం వెళ్లేందుకు ఏర్పాటు చేసే లింకు రోడ్డును 30 ఫీట్లకు కుదించి మిగతా స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. ఎంతో విలువైన భూమిని అక్రమార్కులు తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. సింగరేణి విస్తరణ కోసం గతంలో సేకరించిన భూముల్లో సైతం అక్రమ దందా కొనసాగుతున్నట్లు సమాచారం. ఓసీపీ–5 కోసం సేకరిస్తున్న భూమిలో కూడా గతంలో సంస్థ పరిహారం చెల్లించిన భూములకే మళ్లీ చెల్లించే పరిస్థితి ఏర్పడింది. జనగామ, సుందిళ్ల, ముస్త్యాల గ్రామాల పరిసర ప్రాంతాల్లో భూమి రికార్డులు లేకపోవడంతో మళ్లీ వాటికే పరిహారం చెల్లించే పరిస్థితి. భూసేకరణ సమయంలో పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో సంస్థ భూములకు రక్షణ లేకుండా పోతుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ఆయా అంశాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

# 'సమీకృత' నిర్మాణం.. అన్ని చోట్లా నిదానం!

సంగారెడ్డి : ప్రజలందరికీ ఒకే చోట మాంసం, చేపలు, కూరగాయలు లభించేలా విపణి నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించింది. గజ్వేల్ తరహాలో జిల్లాలోనూ సమీకృత యార్డులు నిర్మించాలని ఆదేశించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. క్షేత్ర స్థాయిలో పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. ఏడాదిలోపు నిర్మాణాలు వినియోగంలోకి తీసుకు రావాలని నిబంధనలున్నా అమలు కావడం లేదు. కేవలం జహీరాబాద్ పట్టణం మినహా మిగిలిన అన్నిచోట్లా ఇదే పరిస్థితి నెలకొంది. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం,



గుత్తేదారులకు బిల్లులు సకాలంలో అందక పనుల్లో జాప్యం నెలకొంటుందనే విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో కథనం.

గతేడాది మంజూరు

జిల్లాలో సంగారెడ్డి, సదాశివపేట, ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, అందోలు–జోగిపేట, జహీరాబాద్ పట్టణాలకు సమీకృత మార్కెట్ యార్డులు గతేడాది మంజూరయ్యాయి. ఆయా పనులు ఏడాదిలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. భవనాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని సూచించింది. పర్యవేక్షణ బాధ్యతను ప్రజారోగ్యశాఖకు అప్పగించింది. ఆ శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. గత్తేదారులతో ఒప్పందం చేసుకొని పనులు ప్రారంభింపజేశారు. ఆ తర్వాత పనుల్లో పురోగతి కరవైంది.

దసరా నాటికి వినియోగంలోకి తీసుకొస్తాం

– వీరప్రతాప్, ప్రజారోగ్యశాఖ ఈఈ

సమీకృత మార్కెట్ యార్డుల పనులు వేగంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. ఏడాదిలోపు పూర్తి చేయాలని నిబంధనలు ఉన్నా.. కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయి. ప్రధానంగా అందోలు–జోగిపేట, ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్‌లో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఆయా పనులపై వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. దసరా నాటికి అన్ని యార్డుల పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తాం.

క్షేత్ర స్థాయిలో ఇలా..సదాశివపేట పట్టణానికి రూ.5.5 కోట్ల నిధులు మంజూరు చేయగా పనులు స్లాబ్ దశకు చేరాయి. అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.2 కోట్లతో చేపట్టిన పనులు పునాది స్థాయిలోనే నిలిచిపోయాయి. అమీన్‌పూర్‌కు రూ.6.4 కోట్లు కేటాయించగా.. కొంతకాలంగా పనుల్లో పురోగతి లేదు. ఇటీవల పునాది పనులు ప్రారంభించారు. తెల్లపూర్‌కు రూ.3.9కోట్లు విడుదల చేయగా.. నిర్మాణం పిల్లర్ల దశదాటలేదు. ఐడీఏ బొల్లారం పరిధిలో రూ.6.5 కోట్లతో చేపట్టిన పనులు పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. సంగారెడ్డి పట్టణంలో రూ.6.7 కోట్లతో గతేడాది పనులు ఆరంభించగా.. స్లాబ్ దశకు చేరాయి. నారాయణఖేడ్‌లో మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.3 కోట్లు ఏడాది క్రితమే మంజూరు చేశారు. ఇక్కడ స్థలం సమస్య కొలిక్కి రాలేదు.ఇక్కడ సకాలంలో..జహీరాబాద్ పట్టణానికి రూ.4.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. అక్కడ సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణాన్ని ఆరు నెలల క్రితమే పూర్తి చేశారు. దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది.

# బడుల్లో సంస్కరణలు.. బాలల్లో ఉత్తేజం


కరీంనగర్ : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు బాలల్లో ఉత్తేజాన్ని నింపుతున్నాయి. వసతి సదుపాయాలతోపాటు బోధనలో విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

కొత్త సదుపాయాలు..

జిల్లాలో మొదటి విడతగా మన ఊరు–మన బడి కింద 230 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి రూ.92.96 కోట్లతో పనులు చేపట్టారు. పనులు పూర్తైన 16 పాఠశాలలను మంగళవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. 97 పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)లను అందించారు. తెరపై పాఠాల బోధనకే కాదు గ్రీన్ ఛాక్ బోర్డుగా ఇది ఉపయోగపడనుంది. బాలల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో 5 వేల మందికి రాగిజావను పంపిణీ చేస్తున్నారు. 152 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కొత్తగా రూం టూ రీడ్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 435 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ప్రభుత్వం అందిస్తోంది. వీటిని విద్యా దినోత్సవంలో ప్రారంభించనున్నారు.

పాఠ్య పుస్తకాలు.. దుస్తుల పంపిణీ

ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులను పాఠశాలల్లో జరిగే కార్యక్రమాల్లో విద్యార్థులకు అందించనున్నారు. జిల్లాలోని 651 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 38,475 మంది బాలలకు




వాటిని అందిస్తున్నారు. ఇప్పటికే ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు బడులకు చేరగా, ఈ ఏడు నుంచి కొత్తగా అందిస్తున్న 70 వేల నోట్ పుస్తకాలు 5 మండలాల బడులకు పంపిణీ చేశారు.

ఉత్తమ అవార్డులతో సత్కారం నేడు జరిగే జిల్లా విద్యా దినోత్సవంలో పలువురిని ఉత్తమ అవార్డులతో సన్మానించనున్నారు. 10 జీపీఏ సాధించిన 10 మంది విద్యార్థులను, పది మంది ప్రధానోపాధ్యాయులను, 15 మంది ఉపాధ్యాయులు, అయిదుగురు ఎస్ఎంసీ ఛైర్మన్లు, అయిదుగురు తల్లిదండ్రులను, ఇద్దరు దాతలను సన్మానించనున్నారు. జిల్లా వ్యాప్తంగా బడుల్లో జాతీయ పతాకావిష్కరణ, ర్యాలీలు, సాంస్కృతి కార్యక్రమాలు వంటి వాటిని నిర్వహిస్తున్నారు. విద్యాప్రగతిని వివరిస్తూ ఉపాధ్యాయులు వేడుకలను ఘనంగా నిర్వహించాలని డీఈవో జనార్దన్‌రావు తెలిపారు.

# లైసెన్స్ పునరుద్ధరణ.. ఇక భారమే

మెదక్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధన భారీ వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. హెవీ వెహికిల్ లైసెన్స్ గడువు పూర్తయిన వారు తిరిగి పునరుద్ధరించుకునేందుకు తప్పనిసరిగా సిరిసిల్లకు వెళ్లాల్సి వస్తోంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్, ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఐడీటీఆర్) కేంద్రం నుంచి ఒక రోజు శిక్షణ పొంది అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం ఇక్కడి ఆర్టీఏ కార్యాలయంలో సమర్పించాల్సిందే. గతంలో మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో పాటు తమ గడువు తీరిన లైసెన్స్ జత చేసి పత్రాన్ని పూరించి ఇస్తే సరిపోయేది. ఇప్పుడు తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధనతో సిరిసిల్ల ఐడీటీఆర్‌కు వెళ్లి ధ్రువీకరణ పత్రం తీసుకురావడం సమస్యగా



మారింది.విధి, విధానాలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉన్న వారు 10 వేల మందికి పైగా ఉంటారు. సిరిసిల్లకు పని రోజుల్లో ఉదయం 9.30 గంటల్లోపే వెళ్లి పేరు నమోదు చేయించుకోవాలి. ఆలస్యంగా వెళ్తే ఆ రోజున శిక్షణకు స్లాట్ కేటాయించరు. లేదంటే ఆ రోజు అక్కడే గడిపి మరుసటి రోజు తర్ఫీదు పొందాల్సి ఉంటుంది. రూ.750 రుసుము చెల్లిస్తే శిక్షణ ఇచ్చి డ్రైవింగ్ పరీక్ష నిర్వహిస్తారు. ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. మెడికల్, ఐడీటీఆర్ ధ్రువపత్రం అప్‌లోడ్ చేసి మరుసటి రోజు రెన్యూవల్ స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత జిల్లా రవాణా శాఖ అధికారి ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేసి డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించి లైసెన్స్ మంజూరు చేస్తున్నారు. ఈ ప్రక్రియకు కనీసం మూడు నుంచి ఐదుల రోజుల సమయంలో పడుతోందని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా రవాణా శాఖ అధికారి జీవీ శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా.. సిరిసిల్ల ఐడీటీఆర్ నుంచి ఒక రోజు శిక్షణ పొందిన పత్రాన్ని తప్పనిసరిగా దరఖాస్తుప్రతికి జత చేయాల్సిందేనని చెప్పారు.

# కృత్రిమ తోరణం.. పచ్చని హారం

ఖమ్మం : అడవిలో సేదతీరాలంటే ఈ నందనవనం రావాల్సిందే. వర్షాకాలంలో జాలువారే జలపాతం. పచ్చనితోరణంలో నడక. కుటీరంలో కాలక్షేపం. చెట్లకింద బల్లలపై ముచ్చట్లు. మణుగూరులోని రథంగుట్ట అర్బన్ పార్కు వద్ద ఈ అనుభూతులు సాధ్యమవుతాయి. అడవిలో నందనవనంలో పిల్లలను, పర్యాటకులను ఆకర్షించేందుకు పలు ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో వీటిని పూర్తి చేసి ప్రారంభించనున్నారు. ఈ పార్కుపై ప్రత్యేక కథనం..

జరిగిన పనులు..

తెలంగాణకు హరితహారం కింద రూ.కోటి మంజూరయ్యాయి. 107 హెక్టార్లలో నందనవనం ఉంటుంది. కూర్చునేందుకు 20 బల్లాలు, మూడు పగోడాలు(గుడిసెలు) ఏర్పాటు చేశారు. వీటికి కేరళ కుటీరం, యాగశాల, జపాన్ కుటీరాలుగా పేరుపెట్టారు. ముఖద్వారం నుంచి నందనవనానికి ఇరువైపులా రహదారిని నిర్మించారు. ఇందులో పర్యాటకులు ప్రత్యేకంగా నడిచేందుకు 2 కి.మీ. దారిని ఏర్పాటు చేశారు. పర్యాటకులు కూర్చునేందుకు బల్లలు ఉన్నాయి. ఆరు మరుగుదొడ్లు నిర్మించారు. రాత్రి వేళలో కూడా వెలుతురు కోసం నందనవనం ఆసాంతం సోలార్ దీపాలు అమర్చారు. రెండు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.

త్వరలో చే పట్టేవి...

రథంగుట్టపై జలపాతం వర్షాకాలంలో వస్తుంది.



నిరంతరం జలపాతం కోసం సోలార్ పద్ధతి ద్వారా నీటిని గుట్టకు ఎక్కించి కృత్రిమ జలపాతాన్ని ఏర్పాటు చేయనున్నారు. గుట్టపై విశ్రాంతి భవనాన్ని నిర్మించాలని చూస్తున్నారు. ఇక్కడ తాడుతో వంతెన ఏర్పాటు చేయనున్నారు. పిల్లలను ఆకర్షించేందుకు వివిధ జంతువులు, పక్షులను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. విశ్రాంతి భవనాలను అడవిలో రెండు, మూడు చోట్ల ఏర్పాటు చేయనున్నారు. తినుబండారాలకు క్యాంటిన్, భోజన సదుపాయానికి వంటశాలలు ఉంటాయి.

జంతువులు, పక్షులు ఉంటేనే..

నందనవనంలో జంతువులు, పక్షులు ఉంటేనే ఆదరణ ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తమవడంతో పార్కు ప్రారంభం ఆలస్యమైంది. వీటికోసం ప్రత్యేకంగా గ్రాసం పెంచుతున్నారు. రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియను త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పక్షుల పెంపకానికి ప్రత్యేక బోనులు చేయిస్తున్నారు. ఇలా జరిగితే పాఠశాల పిల్లలకు ఇది విహార కేంద్రంగా మారుతుంది. ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి వచ్చే అవకాశం ఉంటుంది. ఇందుకోసం అధికారులు ప్రణాళికను రూపొందిస్తున్నారు.

సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. త్వరలో వీటిని పూర్తి చేసి ప్రారంభిస్తాం. పర్యాటకులు ఇక్కడకు వచ్చి సేదతీరేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అందంగా ఉండే ఈ ప్రాంతాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు చేస్తున్నాం. ప్రణాళిక ప్రకారం పనులను చేపడుతున్నాం.

# డిగ్రీ పరీక్షల్లో చూచిరాతల పర్వం!


వరంగల్ : కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 13 నుంచి డిగ్రీ రెగ్యూలర్ పరీక్షలు జరుగుతున్నాయి. 1,81,086 మంది విద్యార్థులకు అధికారులు హాల్‌టికెట్లు జారీ చేశారు. వీరి కోసం వరంగల్‌లో 48, ఖమ్మంలో 33, ఆదిలాబాద్‌లో 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కానీ పరీక్షల్లో చూచిరాతల పర్వం కొనసాగుతోంది. ఇందుకు నిదర్శనమే రోజురోజుకు పెరుగుతున్న డిబార్ల సంఖ్య.

కొరవడిన పర్యవేక్షణ

కొన్ని కేంద్రాల్లో నిర్వాహకులే మాస్‌కాపీయింగ్ ప్రోత్సహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులను తనిఖీ చేయకుండానే లోపలికి అనుమతిస్తున్నారు. కొందరు చిట్టీలు తీసుకొని వెళ్తున్నారు. ఇన్విజిలేటర్లు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఆకస్మికంగా వచ్చిన తనిఖీ బృందాలకు విద్యార్థులు చిట్టీలతో సహా దొరికిపోతున్నారు. కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకోవడానికి ఈ విధానానికి పాల్పడుతున్నారని పలువురు అధికారులు అభిప్రాయ పడుతున్నారు. వారం రోజుల్లో 171 మంది డిబార్ అయ్యారు.

అనర్హులతో విధులు..

పీజీ పూర్తి చేసిన, ఆయా కళాశాలల్లోని అధ్యాపకులను ఇన్విజిలేటర్లగా



నియమించాలి. నాలుగు గంటలు విధులు నిర్వర్తిస్తే కేవలం రూ.150 మాత్రమే చెల్లిస్తుండటంతో చాలా మంది ఆసక్తి చూపడంలేదు. గత పరీక్షలకు సంబంధించిన పారితోషికం ఇప్పటి వరకు చెల్లించలేదని వాపోతున్నారు. ఫలితంగా ఏదో కారణం చెప్పి విధులకు దూరంగా ఉంటున్నారు. దీంతో పలు చోట అనర్హులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. వారు విద్యార్థులను కంట్రోల్ చేయకపోవడంతో కేంద్రాల్లో ఎక్కువగా మాస్ కాఫీయింగ్ జరుగుతుందని విమర్శలు వస్తున్నాయి.

పరిశీలకుల ప్రేక్షక పాత్ర

ప్రతి కేంద్రానికి ముఖ్య పర్యవేక్షణాధికారితోపాటు ఒక పరిశీలకుడు ఉంటారు. వీరి పర్యవేక్షణలో విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పరీక్ష గదిలోకి అనుమతించాలి. ఇలా కొన్ని చోట్ల జరగడం లేదని, ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొంత మంది పరిశీలకులు పరీక్ష ముగియక ముందే వెళ్లిపోతున్నారు. సాధారణంగా పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు, ముగిసిన తర్వాత సమాధాన పత్రాలు ప్యాక్ చేసిన తర్వాత వెళ్లాలని నిబంధనల్లో ఉంది. వీరిపై వర్సిటీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది.

తనిఖీలు చేపడుతున్నాం - ఆచార్య పి.మల్లారెడ్డి, కేయూ పరీక్షల నియంత్రణ అధికారిపరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేపడుతున్నాం. మాస్ కాఫీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థులను స్క్వాడ్ బృందాలు పట్టుకొని డిబార్ చేస్తున్నాయి. అనర్హులకు ఇన్విజిలేషన్ చేస్తే తొలగిస్తాం. ఇలాంటి కేంద్రాలపై నేరుగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. పరీక్ష ప్రశ్న పత్రం ఆలస్యంగా ఇచ్చినప్పుడు ఆ మేరకు అదనపు సమయం ఇవ్వాలని చీఫ్ సూపరింటెండెంట్‌లు, పరిశీలకులకు సూచించాం.

# పాత వాహనంలో కొత్త సారా..!



ఖమ్మం : గుడుంబాను రూపుమాపేందుకు ఆబ్కారీశాఖ అనేక ప్రణాళికలను రచిస్తోంది. అదే సమయంలో అక్రమార్కులూ సరికొత్త విధానాలు అవలంబించడం పరిపాటిగా మారింది. గతంలో ముఠాలుగా ఏర్పడి మారుమూల అటవీ ప్రాంతాల్లో గుడుంబా తయారు చేసి క్యానుల్లో తీసుకొచ్చి ఊర్లలో అమ్మేవారు. ఆబ్కారీశాఖ వెంటాడటంతో పాత పద్ధతికి స్వస్తి పలికి కొత్త తరహా వ్యాపారానికి తెర లేపారు. ఇందుకోసం పాతబడిన, అతి చౌకగా లభించే ఓ వాహనాన్ని కొనుగోలు చేసి.. దానికి ఏదో ఓ ద్విచక్ర వాహన నంబరు తగిలించి అక్రమ సరకును గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. ముందుగా అనువైన ప్రదేశాలను ఎంచుకొని గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా తయారీ మొదలుపెట్టారు. ఇందుకు కావాల్సిన బెల్లం, పటిక ఇతర ముడి పదార్థాలను తుక్కు వాహనాల్లో చేరవేస్తున్నారు. ఇందులో ఒకట్రెండు వాహనాలు ఆబ్కారీ సిబ్బందికి దొరుకుతున్నాయి. కొన్ని ముఠాలు తప్పించుకు తిరుగుతూనే ఉన్నాయి. పట్టుబడితే తుక్కు వాహనాన్ని వదిలేసి స్టేషన్ బెయిల్ తీసుకొని నిందితులు బయటపడుతున్నారు. తిరిగి మరో వాహనంలో అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు.

కొద్ది మోతాదులోనే...

ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల సరిహద్దుల్లో గుడుంబా తయారీ కేంద్రాలు విరివిరిగా వెలిశాయి. అమ్మకాలు అక్కడి పరిసరాల్లోనే ఎక్కువగా ఉండటంతో ఎక్కడి వారు అక్కడే తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకొని ముడి సరకు కావాల్సి వచ్చినప్పుడల్లా ఫోను కొడితే తుక్కు వాహనంలో తీసుకొచ్చే హెూల్‌సేల్ వ్యాపారుల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో ఆబ్కారీ శాఖ తనిఖీ బృందాలకు ఆలం, బెల్లంతో ఉన్న వాహనాలే దొరికాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీ బృందానికి పట్టుబడిన వాటిల్లో ముడి సరకు కేసులే అధికంగా ఉన్నాయి. ఏప్రిల్‌లో టాస్క్‌ఫోర్స్ బృందం, రెండో పట్టణ స్టేషన్ అధికారులు సంయుక్తంగా ఓ వాహనాన్ని పట్టుకున్నారు. అందులో వంద కిలోల బెల్లం, 175 కిలోల పటిక పట్టుబడింది. ఏడాదిగా పట్టుబడిన కేసులను పరిశీలిస్తే అక్రమార్కులు రూటు మార్చారనే విషయం తేటతెల్లమవుతోంది.

కేసులు నమోదు చేస్తున్నాం

నాగేంద్రరెడ్డి, జిల్లా ఆబ్కారీ అధికారి

తనిఖీలు నిరంతరం జరుగుతున్నాయి. ఎక్కడా ఉదాసీనతకు తావు లేదు. ఇప్పటికే 850 బైండోవర్లు చేశాం. పూచీకత్తుపై ఉన్న నిందితులు తిరిగి నేరాలకు పాల్పడితే భారీ మూల్యం చెల్లించుకుంటారు. ఆ విషయం నిందితులకు బాగా తెలుసు. నంబర్ ప్లేట్లు మార్చి వాహనాలు తిరగడం ఇప్పుడు కొత్తేమీ కాదు. అలా తిరుగుతున్నా మేం పట్టుకుంటూనే ఉన్నాం. పోలీసు, ఆర్టీఏ శాఖలతో సమన్వయం చేసుకుంటున్నాం. తనిఖీలూ ఉండేలా ఆయా శాఖల అధికారులతో మాట్లాడి ప్రణాళిక రూపొందిస్తాం.

అప్పటి నుంచే అనుమానం


ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఆబ్కారీ శాఖ అధికారులు మధిర చెక్‌పోస్టు వద్ద ఓ భారీ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో 30 టన్నుల పటిక ఉంది. అంతటి భారీ మొత్తంలో పటిక పట్టుబడటం ఇదే తొలిసారి. మొదట్లో అక్కడి నుంచి ఇక్కడికి అంటూ ఏదో చెప్పుకొచ్చారు. నిజానికి ఆ భారీ వాహనం గుజరాత్ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తున్న క్రమంలో పట్టుబడింది. మున్సిపాలిటీల్లో నీటి సరఫరా విభాగాలకు నీటిశుద్ధి కోసం దీన్ని ఉపయోగిస్తున్నారు. ఇందుకోసమే అనుకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తయారీ పరిశ్రమలు ఉండగా గుజరాత్ నుంచి తెప్పించాల్సిన అవసరం ఏమిటని ఆబ్కారీశాఖ ప్రశ్నిస్తోంది. కాలం చెల్లిన వాహనాలను కొనుగోలు చేసి వాటిలో గుడుంబా తయారీ కేంద్రాలకు ముడి సరకును తరలిస్తున్నారనే వాదనకు పట్టుబడుతున్న వాహనాలు, బెల్లం, పటిక బలం చేకూరుస్తున్నాయి. ముమ్మరంగా వాహన తనిఖీలు జరిగితే ఈ అక్రమ రవాణాకు తెర పడుతుంది. ఇది జరిగితే గుడుంబా తయారీ కూడా ఆగిపోతుందనే సూచనలు ఆబ్కారీ శాఖలోనే వినిపిస్తున్నాయి. ఇందుకు ఆబ్కారీశాఖ, పోలీసు, సంయుక్త వ్యూహం రచించాలనే వాదనలున్నాయి.

# మూగబోయిన ప్రజావాణి

వరంగల్ : ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం వివిధ పరిపాలన పరమైన కారణాలు, దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో నెల రోజుల నుంచి మూగబోయింది. నేరుగా తమ సమస్యలను కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు విన్నవించుకుందామనుకునే వారికి నిరాశే ఎదురవుతోంది. ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయంగా ఫోన్ ద్వారా సమస్యలు వినేందుకు రూపొందించిన డయల్ యువర్ కలెక్టర్, ఫోన్‌ఇన్ తదితర ప్రజా అనుసంధాన కార్యక్రమాలకు గతంలోనే చరమ గీతం పాడారు. దీంతో తమ గోడు వినేవారే కరవయ్యారా అని సామాన్య జనం నిస్సహాయంగా ప్రశ్నిస్తున్నారు.

వారధి' ఏమైంది..?

జిల్లాలోని ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు కలెక్టరేట్ వరకు రాకూడదని అప్పటి కలెక్టర్ బి.గోపి ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా 'వారధి గ్రీవెన్స్ యాప్' రూపొందించారు. ప్రజలకు దూరాభారం తగ్గించి, తక్షణ పరిష్కార మార్గాలను చూపించేందుకు రూపొందించిన యాప్ నిర్వహణ ఆయన బదిలీతో అటకెక్కింది. యాప్ రూపకల్పన, నిర్వహణ బాధ్యతలను హైదారాబాద్‌కు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ వీమ్యాక్స్ కంపెనీకి అప్పగించారు. ఏడాది కాలంపాటు జిల్లాలోని వివిధ శాఖల వారి వివరాలను సేకరించి సాధారణ పౌరులు ఫిర్యాదు చేసేందుకు ఓ యాప్, వాటిని చూసి పరిష్కరించేందుకు జిల్లాలోని అధికారులకు ఓ యాప్ కేటాయించారు. ఏ శాఖకు సంబంధించిన సమస్య ఉంటే పౌరులు యాప్‌లో సూచించిన విధంగా ఫిర్యాదులు నమోదుచేయవచ్చు. వెంటనే మరో యాప్ ద్వారా అధికారులకు




ఫిర్యాదులు అందుతాయి. ఉదాహరణకు ఓ రైతుకు భూమికి సంబంధించిన సమస్య పరిష్కారం కోసం యాప్‌లోని 'రెవెన్యూ ఆప్షన్' ఎంచుకుని ఫిర్యాదు నమోదుచేయాలి. దాంతో నేరుగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందుతుంది. సమస్య పరిష్కారం ఏ దశకు వచ్చిందో తెలుసుకునేందుకు కార్యాలయానికి వెళ్లకుండా నేరుగా యాప్‌లోనే పరిశీలించుకునే సౌలభ్యం ఉంది. పరిష్కారంలో జాప్యం జరిగితే యాప్ ద్వారానే ఉన్నతాధికారులనూ సంప్రదించే అవకాశం కల్పించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధి నుంచి రూ.లక్షలు ఖర్చుచేసి రూపొందించిన యాప్ ప్రజల్లోకి వెళ్లకముందే నిర్వీర్యమైపోయింది. గ్రీవెన్స్ యాప్ నిర్వహణ గురించి కలెక్టర్ ప్రావీణ్య ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే తిరిగి వినియోగంలోకి వచ్చే అవకాశముంది. కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం..:- శ్రీకాంత్, కలెక్టరేట్ ఏవోఈ ఏడాది మార్చిలో అప్పటి కలెక్టర్ గోపి వారధి గ్రీవెన్స్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. పూర్తిస్థాయిలో అమలులోకి రాకముందే ఆయన బదిలీపై వెళ్లారు. ప్రత్యేక గ్రీవెన్స్ యాప్ నిర్వహణ, అమలుకు సంబంధించిన వివరాలను దశాబ్ది ఉత్సవాల తర్వాత కలెక్టర్ ప్రావీణ్య దృష్టికి తీసుకెళతాం. ప్రజావాణి రద్దయినా కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించాల్సిందిగా అధికారులకు సూచించాం.

# కళ కోల్పోతున్న రింగ్ రోడ్డు కూడళ్లు



ఖమ్మం : మూడు వైపులా త్రిభుజాకార ఐలాండ్‌లు, పచ్చని మొక్కలు, ఫౌంటెయిన్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రధాన కూడలిగా ఉన్న తల్లాడ రింగురోడ్డు అది. ఇక్కడి నుంచి భద్రాచలం, ఖమ్మం, సత్తుపల్లి నుంచి రాజమహేంద్రవరం, వైజాగ్ ఇలా మూడు వైపులకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం ఆ కూడలి నిర్వహణ లోపంతో వెలవెలబోతోంది. ఆ నిర్మాణాలు గత ప్రాభవానికి గురుతులుగానే మిగులుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి కూడలిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సైతం రెండేళ్ల క్రితం ప్రకటించారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు.

భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసం

రింగురోడ్డు నుంచి మూడువైపులా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వైజాగ్‌కు పెద్దపెద్ద యంత్రాలను తరలించే లారీలు, కాకినాడకు భారీ గ్రానెట్ రాళ్లను రవాణా చేసే వాహనాలు మలుపుతిరిగే సమయంలో రింగురోడ్డు గోడలు, ఇనుప గ్రిల్స్, దిమ్మెను తాకుతూ వెళ్లడంతో అవి విరిగిపోతున్నాయి. త్రిభుకార ఐలాండ్‌కు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప జాలీలు పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఆ జాలీల్లో నీరు లేక మొక్కలు ఎండిపోతున్నాయి. విద్యుత్తు దీపాలు సరిగా వెలగక అంధకారంగా మారింది. తల్లాడ పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేసినా వాటి వెలుగులు సరిపోవడం లేదు.

దారిలో కలిసిన డివైడర్

తల్లాడ-దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిలో తల్లాడ బస్టాండ్ నుంచి ఉన్నత పాఠశాల వరకు డివైడర్ ఉంది. ప్రతి సంవత్సరం రహదారులు నిర్మిస్తుండటంతో రోడ్డు ఎత్తు పెరిగి డివైడర్‌కు సమానమైంది. వాహనదారులు డివైడర్‌పై నుంచీ రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తల్లాడ రింగురోడ్డుకు పూర్వవైభవం తీసుకురావాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రహదారి విస్తరించి.. డివైడర్లు విస్మరించి

మధిర-విజయవాడ రోడ్డులో ఎర్రుపాలెంలోని ప్రధానమైన రింగ్ కూడలిలో రహదారి విస్తరించిన అధికారులు ఆ మేరకు సౌకర్యాలు కల్పించకపోవటంతో వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. విజయవాడకు ప్రధాన రహదారి కావటంతో వాహనాల రద్దీ పెరుగుతోంది. మధిర, విజయవాడ వైపు ఉన్న రహదారుల్లో డివైడర్లు ఏర్పాటు చేయకపోవటంతో వేగంతో వచ్చి తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక రింగ్‌లో ఫౌంటెయిన్ నిర్మించకుండా వదిలేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి నిధులు కేటాయించి, డివైడర్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలు పడగానే తల్లాడ రింగురోడ్డు కూడలిలో మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దుతాం. అవకాశం ఉంటే తల్లాడ రింగురోడ్డు కూడలిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. తల్లాడ-దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిలో రింగురోడ్డు కూడలి ఉన్నది. ఈ రింగురోడ్డును అభివృద్ధి చేయాల్సిన బాధ్యత జాతీయ రహదారి అధికారులదే. ఆ అధికారులు రింగురోడ్డు కూడలి గురించి పట్టించుకోవడం లేదు. గ్రామపంచాయతీకి సంబంధం లేదు.

బి.రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ, తల్లాడ

# మూత్రశాల ఆవరణలోనూ వ్యాపారమే!

ఎనుమాముల : లక్ష్మీపురం నూతన మోడల్ కూరగాయల మార్కెట్‌లో అడ్డదారుల్లో అడ్డాలను సంపాదించిన వారు వాటిని రూ.లక్షల్లో అమ్మకానికి పెడుతున్నారు. కూరగాయల మార్కెట్ బస్టాండు వైపు ఉన్న ద్వారం పక్కనే నిర్మించిన మూత్రశాల ఆవరణను ఓ వ్యాపారి ఏడాదికి రూ.లక్ష చొప్పున ఇతరులకు అద్దెకు ఇచ్చారు. మార్కెట్‌కు వచ్చే వారు మూత్రశాలకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసి మరీ కూరగాయలను విక్రయిస్తున్నారు. ఏడాదిన్నర నుంచి ఇదే తంతు కొనసాగుతున్నా.. మార్కెట్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. వ్యాపారికి వచ్చే మొత్తంలో కొంత వాటా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పోతోందని తెలుస్తోంది.

ఒక్కొక్కరికి 3 నుంచి 4 అడ్డాలునూతన మార్కెట్‌లో చిల్లర వ్యాపారులకు కూరగాయలను విక్రయించేందుకని 4/4, 6/6, 8/8 అడుగుల విస్తీర్ణంలో అడ్డాలను కేటాయించారు.

ఒక్కో అడ్డాకు రూ.300 నుంచి 800 వరకు విస్తీర్ణాన్ని బట్టి నెలవారీ అద్దె చెల్లిస్తున్నారు. వాటితో పాటు కవర్ షెడ్డులో 158 ప్లాట్‌ఫాంలు నిర్మించినా గిరాకీ లేదని ఇతరులకు అమ్ముకున్నారు. ఇప్పటికీ అర్హులకు అడ్డాలు రాలేదని కొందరు మార్కెట్ కార్యాలయం చుట్టూ తిరుగతున్నారు. మరోవైపు ఒక్కో వ్యాపారికి 3 నుంచి 4 అడ్డాల్లో వ్యాపారం సాగిస్తున్నారు. నెలవారీ అద్దె మాత్రం ఒకే అడ్డాకు చెల్లిస్తుండడంతో.. మార్కెట్ ఆదాయానికి గండి పడుతోంది. మార్కెట్‌లోని ఒక్కో కమిషన్ వ్యాపారికి కమిషన్ దుకాణంతో పాటు 3 నుంచి 4 అడ్డాలు వారి బినామీ పేర్లపై ఉన్నాయి.. వాటిని స్థానిక గుమస్తాలకు అద్దెకు ఇస్తూ.. ప్రతి నెలా లాభాలను ఆర్జిస్తున్నారు.

కమీషన్ వ్యాపారుల చిల్లర వర్తకం..కూరగాయల మార్కెట్‌లో తొలుత నిర్మించిన 82 దుకాణాలతో పాటు ఇటీవల నూతనంగా నిర్మించిన 14 దుకాణాలతో కలుపుకుని మొత్తం 96 కమిషన్ దుకాణాల్లోని వ్యాపారులు 70 శాతం చిల్లర వర్తకం కొనసాగిస్తున్నారు. సాధారణంగా కమిషన్ వ్యాపారులు ఎక్కువ మొత్తంలో వివిధ ప్రాంతాల నుంచి రైతుల నుంచి కొనుగోలు చేసిన సరకును కూరగాయల మార్కెట్‌లో చిల్లర వర్తకులకు కమిషన్‌పై విక్రయించాల్సి ఉంటుంది. లక్ష్మీపురం మార్కెట్‌లో మాత్రం కమిషన్ వ్యాపారులూ చిల్లర వర్తకులతో పోటీగా కూరగాయల అమ్మకాలు జరుపుతుండడంతో.. తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని చిల్లర వర్తకులు వాపోతున్నారు.చర్యలు తీసుకుంటాం..-బి.వి.రాహుల్, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిమార్కెట్‌లోని అడ్డాలపై కూరగాయలు విక్రయించకుండా ఇతరులకు అద్దె ప్రాతిపదికన ఇస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

# బడిబాట.. విజయబావుటా

కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు ఈ విద్యా సంవత్సరం ముందు నుంచి నిర్వహించిన 'బడిబాట' ఉభయ జిల్లాల్లో విజయవంతమైంది. ఈ నెల 3 నుంచి 17 వరకు 'ఆచార్య జయశంకర్ బడిబాట' కార్యక్రమం చేపట్టారు. మండుటెండల్లోనూ అధికారులు, ఉపాధ్యాయులు చొరవచూపి విద్యార్థులను గుర్తించారు. ఆపై ప్రవేశాలు కల్పించారు. ఆంగ్ల మాధ్యమ ప్రవేశం, 'మన ఊరు - మన బడి' పథకంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాలయాలకు పంపేందుకు మొగ్గుచూపారు. ఫలితంగా ఒకటో తరగతిలో ఖమ్మం జిల్లాలో 3,974, భద్రాద్రి జిల్లాలో 5,036 ప్రవేశాలు దక్కాయి. రెండు నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉభయ జిల్లాల్లో కలిపి 4,343 మంది విద్యార్థులు చేరడం విశేషం. మొత్తం ప్రవేశాల్లో ప్రైవేటు విద్యాలయాల నుంచి వచ్చినవారు 4,495 మంది ఉన్నారు. తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమంలో బోధన, డిజిటల్ తరగతులు, గ్రంథాలయాల ఏర్పాటు, రాతపుస్తకాల పంపిణీ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి అంశాలు కలిసొచ్చాయని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

# జలకళ

రంగారెడ్డి : శామీర్‌పేట పెద్ద చెరువు నిండి అలుగుపారుతోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వందలాది ఎకరాల్లో వరి, మెట్ట పంటలు పండుతాయని రైతులు పేర్కొంటున్నారు. అలాగే భూగర్భ జలమట్టం పెరిగి చెరువు కింద వేసుకున్న బోర్లలోనూ నీరు సమృద్ధిగా వచ్చే అవకాశం ఉంది. యాసంగి పంటలకు కూడా ఢోకా లేదని రైతులంటున్నారు. ఇదిలా ఉంటే హైవే పక్కనే ఉన్న పెద్ద చెరువును చూసేందుకు సందర్శకులు తరలివస్తున్నారు. ప్రకృతి అందాలను, చెరువు నీటిని చూస్తూ మైమరిచి పోతున్నారు. నగరానికి చెరువులో ఉన్న శామీర్‌పేట పెద్ద చెరువు పర్యాటకంగానూ దినదినాభివృద్ధి చెందుతోంది.

ఈ సారి వానాకాలం మొదట్లోనే కురిసిన భారీ వర్షాలతో జల వనరుల్లోకి భారీగా నీరు చేరి కళకళలాడుతు న్నాయి. ఎప్పుడెప్పుడా అని అన్నదాతలు ఎదురు చూస్తున్న శామీర్‌పేట పెద్ద చెరువు నిండి అలుగుపారుతోంది. గతంలో ఎన్నడూ వానకాలం మొదట్లో చెరువు ఇంత తొందరగా నిండలేదు. కొద్ది రోజుల క్రితం కురిసిన వానలకు చెరువులోకి భారీగా నీరు చేరి నిండు కుండలా మారింది. దీంతో ఆయకట్టు రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ వానకాలం పంటలు చెరువు నీటితో పండుతాయి. వచ్చే ఎండ యాసంగిలో చెరువులో నీరు తగ్గినా చెరువు కింద వేసిన బోర్లలో నీటి మట్టం పెరిగి ఆ పంటకు కూడా ఢోకా లేదనే భరోసాలో రైతులు ఉన్నారు.జిల్లాలోనే అతి పెద్ద చెరువు...మేడ్చల్ జిల్లాలోనే శామీర్‌పేట



పెద్ద చెరువు అతిపెద్దది. వందలాది ఎకరాల్లో ఈ చెరువు విస్తరించి ఉంది. మొన్నటి వానలకు చెరువు నిండి అలుగు పారుతోంది. ఎగువ ప్రాంతాలైన మేడ్చల్, దుండికల్ ప్రాంతాల నుంచి వరద నీరు చేరింది. చెరువులో నీటి నిల్వను తెలిపే 7 గజాల గుండు మునిగిపోయింది. అంటే నీటి మట్టం పూర్తిస్థాయికి చేరిందన్నమాట! శామీర్‌పేట పెద్దచెరువు నిండి అలుగు పారుతుండటంతో కట్టమైసమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బత్తుల ప్రభాకర్‌యాదవ్ అధ్వర్యంలో డైరెక్టర్లు, సర్పంచ్ బాలమణి, ఎంపీపీ ఎల్లూబాయి, వైస్‌ఎంపీపీ యెల్లు సుజాత, జడ్పీటీసీ అనిత, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుదర్శన్, ప్రజా ప్రతినిధులు కొన్ని రోజుల క్రితం గంగమ్మతల్లికి జలకుండ పూజలు చేశారు. ఆయకట్టు రైతులకు పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. అలాగే ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు ఆయకట్టుకు నీటి విడుదల చేశారు. శామీర్‌పేట పెద్ద చెరువు 2009, 2014లో చెరువు నిండి అలుగు పారగా, గత అక్టోబర్‌లో, ప్రస్తుతం చెరువు నిండి అలుగు పారుతోంది. శామీర్‌పేట పెద్ద చెరువు శిఖం (ఎఫ్‌టీఎల్) 1,200 ఎకరాలు ఉండగా చెరువు లోతు 33 ఫీట్ల వరకు ఉంటుంది. చెరువు నిండితే 2,600ఎకరాల మేర తరి, మరో 2,000 ఎకరాల మేర ఖుష్కిలో పంటలు సాగు అవుతాయి. చెరువు ఆయకట్టు కింద ఈ సారి 2వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి

హైదరాబాద్-రామంగుండం రాజీవ్ రహదారిని ఆనుకొని ఉండే శామీర్‌పేట పెద్ద చెరువు పర్యాటక కేంద్రంగానూ అభివృద్ధి చెందుతోంది. కొన్నేళ్ల క్రితమే ఈ చెరువు వద్ద ప్రభుత్వం మినీ ట్యాంక్‌బండ్‌ను నిర్మించింది. హైవేకు ఆనుకొని నగరానికి 30కిలోమీటర్ల పరిధిలో ఉండడంతో పర్యాటకులు భారీ సంఖ్యలో చెరువు వద్దకు వచ్చి ఉత్సాహంగా గడుపుతున్నారు. ప్రతీ శని, ఆదివారాల్లో వందలాది మంది పర్యాటకులు చెరువు వద్దకు వచ్చి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. అలాగే హైవే వెంబడి వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు సైతం చెరువు వద్ద సేదతీరుతున్నారు. సందర్శకుల కోసం ప్రభుత్వం, మున్సిపాలిటీ ఇక్కడ కొన్ని సౌకర్యాలు కల్పించింది. చుట్టూ చెట్టుచేమలు, వాగులు, బ్రిడ్జితో ఈ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుంది. చెరువులో భారీగా నీరు ఉండడంతో సందర్శకులు తరలివస్తున్నారు. యేటా జిల్లా పరిధి ప్రాంతాల నుంచే కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వినాయక ప్రతిమల నిమజ్జనాన్ని ఈ చెరువులో నిర్వహిస్తుండడంతో పెద్ద చెరువు మరింత ప్రాచుర్యం పొందింది.

## బీటీ రోడ్డు నిర్మాణం ఎప్పుడో?

రంగారెడ్డి : మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం ప్రతిపాదనల్లోనే నిలిచింది. పాలక ప్రజాప్రతినిధుల, నేతల, అధికారుల హామీలకే పరిమితమైంది. అసలే అంతంతమాత్రంగా ఉన్న మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చోట్ల గోతులేర్పడి, బురదమయంగా మారింది. నిత్యం ప్రయాణికులు ఈ రోడ్డు పై నరకయాతన పడుతున్నారు. మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామానికి బీటీరోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అవురుపల్లినుంచి నల్లవారిపల్లి మీదుగా చంద్రాయణపల్లి వరకు బీటీరోడ్డు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రథినిధులు, అధికారులను కోరుతున్నారు. ఐదు కిలోమీటర్ల ఈ రోడ్డును పీఎం జీఎసవైలో బీటీ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాధించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కూడా ఈ రోడ్డు బీటీకి తొలి ప్రాధాన్యమిస్తూ నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించారు. గతేడాది ప్రతిపాదనలు పంపినా బీటీ రోడ్లలో చాలావరకు మంజూరైన ఈ రోడ్డు మిగిలి పోయింది. ఇతర ప్రాంతాలకు వెళ్లలంటే నల్లవారిపల్లి గ్రామస్తులు కొన్ని సార్లు విధిలేక అవురుపల్లి, చంద్రాయణపల్లి, పోలెపల్లి గేటుకు వెళ్లాల్సి వస్తుంది. బీటీ రోడ్డు నిర్మాణ విషయంలో ఉన్నతస్థాయి అధికారులు ప్రజాప్రథినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇబ్బందులు పడుతున్నాంఅవురుపల్లి నుంచి నల్లవారిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా పాడైంది. కాలినడకకు సైతం కష్టంగా మారింది. రోడ్డుపై గోతులు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. పాడైన రోడ్డుపై చిన్న చిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బీటీ రోడ్డు నిర్మించి ఇబ్బందులు తీర్చాలని రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. - ఇటికాల విక్రమ్‌రెడ్డి, గ్రామనాయకుడు, నల్లవారిపల్లి

త్వరలో బిటీ రోడ్డు నల్లవారిపల్లి గ్రామానికి పీఎమ్‌జీఎసవైలో బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించడం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో త్వరలో బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాం. ఈ ఏడాది పీఎంజీఎసవైలో ప్రతిపాధించిన రోడ్లలో నల్లవారి పల్లికి తొలి ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది.

# గొర్రెలొస్తున్నాయ్!



రంగారెడ్డి : ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండడంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలపై మళ్లీ దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఆగిపోయిన గొర్రెల పంపిణీ పథకాన్ని మళ్లీ ముందుకు తీసుకెళ్లేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. గతంలో కంటే యూనిట్ ధరను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో గొర్రెల పంపిణీ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గొర్రెల పంపిణీ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గొల్ల, కుర్మలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గతంలో ప్రభుత్వం అమలు చేసిన సబ్సిడీపై గొర్రెల పంపిణీ పథకం అర్థాంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దాదాపు ఐదేళ్ల పాటు నిలిచిపోయిన ఈ పథకాన్ని మళ్లీ పట్టాలెక్కిస్తూ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో గతంలో నిలిచిపోయిన రెండో విడత గొర్రెల పంపిణీకి మోక్షం లభించినట్లయింది. తొలివిడత పంపిణీ కానీ యూనిట్లతో పాటు అదనంగా కొత్త యూనిట్లు మంజూరు చేశారు. దీంతో రంగారెడ్డిజిల్లాలో 31,037 యూనిట్లు ఈసారి పంపిణీ చేయనున్నారు. వికారాబాద్ జిల్లాలో 11,866 యూనిట్లు, మేడ్చల్ జిల్లాలో3వేల యూనిట్లు పంపిణీ చేయనున్నారు. గతంలో కంటే గొర్రెలు ధరలు పెరగడంతో ఈ సారి యూనిట్ ధర కూడా పెంచారు. సర్కారు తాజాగా తీసుకున్న నిర్ణయంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో కులవృత్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఆయా కులవృత్తుల వారి కోసం ప్రత్యేక పథకాలను ఆరంభించింది. ఇందులో భాగంగా 2017లో ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాను ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లు పంపిణీ చేశారు. అయితే తొలివిడత లక్ష్యాల మేరకు గొర్రెల పంపిణీ చేయలేదు. ఈ పథకంలో అవకతవకలు జరగడం, భారీగా నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో రెండో విడత పంపిణీ ఆరంభంలోనే ఆగిపోయింది. లబ్ధిదారుల ఎంపిక పూర్తయినప్పటికీ ఇంతవరకు వారికి గొర్రెలు పంపిణీ చేయలేదు. దీంతో అప్పటి నుంచి లబ్ధిదారులు గొర్రెల కోసం ఎదురుచూస్తున్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినా వీటిని విడుదల చేయలేదు. అలాగే యూనిట్ ధర, మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో రెండో విడత అసలు మొదలు కాలేదు. దీంతో ఐదేళ్లుగా కొత్తగా ఒక్క లబ్ధిదారుడికి కూడా ప్రయోజనం కలగలేదు. లబ్ధిదారులు తమకు ఎప్పుడు గొర్రెలు పంపిణీ చేస్తారా? అని కళ్లుకాయలు కాసే విధంగా ఎదురుచూస్తేనే ఉన్నారు. ఈ క్రమంలో రెండో విడత పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో తొలి విడతలో పంపిణీ చేయని యూనిట్లు రెండో విడతలో చేస్తామని గతంలో ప్రకటించారు. దీనిప్రకారం రెండో విడత 21,037 యూనిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే కొన్నేండ్లేగా ఈ ప్రక్రియ ఆగిపోవడంతో రెండోవిడత అదనంగా 10వేల యూనిట్లు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో రంగారెడ్డిజిల్లాలో రెండోవిడతలో 31,037 యూనిట్లు పంపిణీ చేయనున్నారు. ఒక్కో యూనిట్ కింద లబ్ధిదారులకు ప్రభుత్వం 20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలు అందజేయనున్నారు. యూనిట్ ధర రూ. 1.75లక్షలుమార్కెట్‌లో గొర్రెల ధరలు పెరగడంతో యూనిట్ విలువ కూడా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడత గొర్రెల పంపిణీ ప్రారంభించిన సమయంలో యూనిట్ విలువ రూ. 1.25లక్షలుగా ఉండగా ఇప్పుడు దీన్ని రూ. 1.75లక్షలకు పెంచింది. 75శాతం సబ్సిడీతో ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయగా, మిగిలిన 25శాతం లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. దీంతో లబ్ధిదారుడు తన వాటా కింద పెరిగిన యూనిట్ వ్యయం మేరకు రూ. 43,750లు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో లబ్ధిదారులు రూ. 31,250 చెల్లించే వారు. ఇప్పుడు యూనిట్ ధర పెరగడంతో లబ్ధిదారుడి వాటా కూడా పెరిగింది. రెండో విడతలో అక్రమాలకు తావివ్వకుండా ప్రభుత్వం మార్పులు చేసింది. గొర్రెలను రీసైక్లింగ్ చేసేలాంటి అక్రమాలను అడ్డుకట్టవేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టనుంది. లబ్ధిదారుల జాబితా నమోదు కోసం ప్రత్యేక యాప్‌ను తయారు చేశారు. ఇందులో భాగంగా లబ్ధిదారులకు జిల్లా, మండల, గ్రామాల ఆధారంగా ప్రత్యేకంగా కోడ్ కేటాయించారు. లబ్ధిదారులకు గుర్తింపుసంఖ్యను కేటాయిస్తున్నారు. దీని ప్రకారం లబ్ధిదారులే నేరుగా తమ ఖాతా నుంచి అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఖాతాకు తమ వాటా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

వచ్చేనెల నుంచి పంపిణీరెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని సెప్టెంబరు మొదటి వారం నుంచి ప్రారంభిస్తామని జిల్లా పశు వైద్యాధికారి అంజిలప్ప తెలిపారు. తొలి విడత మిగిలిపోయిన 10వేల యూనిట్లతో పాటు గతంలో రెండో విడత కేటాయించిన 21,037 యూనిట్లు కలిపి మొత్తం 31,037 యూనిట్లు ఈ సారి పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారుల వివరాలను కంప్యూటర్‌లో పొందుపరుస్తున్నామని, కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా వీటిని పంపిణీ చేస్తామని తెలిపారు.

# ముహూర్తం ఎప్పుడు?

రంగారెడ్డి : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి వేరైన వికారాబాద్, మేడ్చల్ కలెక్టరేట్లను సీఎం కేసీఆర్ ఈ నెల 16, 17 తేదీల్లో ప్రారంభించనున్నారు. అయితే కొంగరకలాన్‌లో ఆరు నెలల క్రితమే పూర్తయిన రంగారెడ్డి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ప్రారంభోత్సవంపై మాత్రం సందిగ్ధత నెలకొంది. గత మార్చి 31 వరకే కాంట్రాక్టర్ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించారు. అయినా కలెక్టరేట్ భవన ప్రారంభంపై ఇప్పటికీ స్పష్టత లేకుండా పోయింది. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలను నిర్వహించుకుంటున్న ఈ తరుణంలోనే కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారని అంతా అనుకుంటుండగా ప్రభుత్వం దీనిపై ఇంకా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో చాలా జిల్లాలకు నూతన కలెక్టరేట్లను నిర్మించారు. అలాగే కొంగర కలాన్‌లో అన్ని హంగులతో రంగారెడ్డి కలెక్టరేట్ సిద్ధమైంది. 42ఎకరాల విస్తీర్ణంలో రూ. 50కోట్లతో పనులు పూర్తి చేశారు. కానీ ఈ కలెక్టరేట్ ను నేటికీ ప్రారంభించలేదు. ప్రభుత్వం కలెక్టరేట్‌ను ఎప్పుడు ప్రారంభిస్తుందో ఎవరికీ తెలియడం లేదు. ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కూడా స్పష్టత లేదు. సమీకృత కలెక్టర్ కార్యాలయం పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా ప్రారంభానికి ముహుర్తం ఖరారు చేయడం లేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 16న వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేను ఈ నెల 17న ప్రారంభించనున్నారు. కానీ.. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవంపై రేపు మాపు అంటూ ఊరిస్తున్నారు. నగరం ఆవల ఔటర్ రింగ్ రోడ్డు పక్కన కొంగరకలాన్ సమీపంలో నిర్మించిన కొత్త కలెక్టరేట్ జిల్లా ప్రజలకు అందుబాటులో లేదన్న విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. కొంత మంది బడా నేతలు కలెక్టరేట్ చుట్టూ వందల ఎకరాల్లో భూములు కొనుగోలు చేశారు. కలెక్టరేట్ నిర్మించడంతో అక్కడ భూములకు ఉన్నంటుండి రెక్కలొచ్చాయి. కలెక్టరేట్ నిర్మించకముందు గజం ధర రూ. 3వేల నుంచి 4వేలు ఉండేది. ఇప్పుడా ధర రూ. 30వేలకు పైమాటే! పెద్దపెద్ద వెంచర్లు వెలిశాయి. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో భూములు బంగారంగా మారాయి.

మొదటి నుంచీ వ్యతిరేకతే

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం రెండు నియోజకవర్గ ప్రజలకు మాత్రమే కొత్త కలెక్టరేట్ సమీపంగా అందుబాటులో ఉంది. కానీ.. జిల్లాలోని మిగతా నియోజకవర్గాలైన చేవెళ్ల, షాద్‌నగర్, శేరిలింగంపల్లి, కల్వకుర్తి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉంటుందని నిరాసక్తత వ్యక్తమైంది. ఉదాహరణకు చేవెళ్ల మండలం కౌకుంట్ల గ్రామస్తులు వికారాబాద్ వెళ్లాలంటే 10కిలో మీటర్లు ప్రయాణించాలి. అదే ఈ గ్రామస్తులు కొంగర కలాన్ చేరుకోవాలంటే.. 78కిలో మీటర్ల దూరం అవుతుంది. ఇప్పుడు నగరంలో ఉన్న కలెక్టరేట్ కంటే దూరంగానే ఉంది. ఇలా మిగతా నియోజకవర్గాల ప్రజలు కూడా దూరమే అవుతుంది. మొదటి నుంచీ కొంగరకలాన్‌లో కొత్త కలెక్టరేట్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. కొంగర కలాన్ కొత్త కలెక్టరేట్ చేసుకునేందుకు బస్సు సౌకర్యం కూడా లేదు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి వెళ్లేందుకు అవకాశం ఉంది. కార్లు, ఇతర సొంత వాహనాలున్న వారు వెళ్లేందుకు సౌకర్యవంతంగానే ఉంది. బస్సుకు రావాలంటే.. రెండు మూడు బస్సులు ఎక్కి దిగాల్సిందే. కలెక్టరేట్‌కు ఏదైనా పనికోసం వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునేందుకు ఒక రోజు పడుతుంది. కొంగరలో కొత్త కలెక్టరేట్ అంటేనే అధికారులు ఆమ్మో.. అంత దూరమా? అంటున్నారు. ఇన్నేళ్లుగా నగరంలోని కలెక్టరేట్‌లో విధులు నిర్వహించిన అధికారులు ఇప్పుడు అంత దూరం వెళ్లాలా? అని ఉస్సూరుమంటున్నారు. 90శాతం మంది అధికారులు, ఉద్యోగులు కొత్త కలెక్టరేట్‌లో పనిచేసేందుకు అయిష్టత చూపుతున్నారు. రాజేంద్రనగర్, తెలంగాణ పోలీస్ అకాడమీ సమీపంలో నూతన కలెక్టరేట్ కట్టిస్తే అందరికీ అనుకూలంగా ఉండేదని అంటున్నారు. అప్పు దున్న కలెక్టర్ రఘునందన్‌రావు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఓ భవనాన్ని కూడా కలెక్టరేట్ కోసం ఒకే చేశారు. కానీ.. ప్రయోజనం లేకుండా పోయింది. కొంగర కలాన్‌లో కొత్త కలెక్టరేట్ భవన నిర్మాణాన్ని ప్రారంభంలో వ్యతిరేకించడం తో కొన్ని నెలల పాటు కలెక్టరేట్ నిర్మాణ పనులూ నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ తిరిగి పనులను వేగిరం చేసి పూర్తిచేశారు. ఎన్నో అంవాంతరాల మధ్య ఎట్టకేలకు కలెక్టరేట్ నిర్మాణం పూర్తయింది. మార్చి 31 వరకు అన్ని పనులు పూర్తిచేసి కాంట్రాక్టర్ నిర్మాణాన్ని ప్రభుత్వానికి అప్పగించారు. ఈ నెలాఖరు వరకు ముహూర్తం ఖరారు కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇది మిస్సైతే.. దసరాకు ప్రారంభోత్సం కావచ్చంటున్నారు.

ఆధునిక హంగులతో..

అన్ని శాఖలు ఒకే చోట ఉండేలా కలెక్టరేట్ భవనాన్ని నిర్మించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించనున్నారు. పచ్చదనం కోసం ఈ ప్రాంగణంలో 30వేలకుపైగా వివిధ రకాల మొక్కలు నాటారు. ప్రహరీ, రోడ్లు, అంతర్గత భవనాలు, విద్యుత్, నీటి సరఫరా పనులు పూర్తిచేశారు. కొత్త కలెక్టరేట్‌లోకి 36 శాఖల కార్యాలయాలు రానున్నాయి. ఇందుకోసం లక్ష చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించారు. ఆయా శాఖలు, వాటిలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్యకు అనుగుణంగా స్థలాల కేటాయింపు చేశారు. 500 మంది కూర్చునే సామర్థ్యంగల ఆడిటోరియాన్ని ఏర్పాటు చేశారు. పోస్టాఫీసు, బ్యాంకు, డిస్పెన్సరీ, ఫైర్ సర్వీసెస్, క్యాంటీన్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ప్రారంభోత్సవ గడువు మూడుసార్లు పొడిగింపు..

2017 అక్టోబరు 12న అప్పటి రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి పద్మారావు కలెక్టరేట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు పూర్తి కావడానికి ఇప్పటి వరకు ఐదేళ్ల సమయం పట్టింది. కార్యాలయంలోకి అడుగుపెట్టేందుకు మరికొన్ని రోజులు సమయం పట్టే అవకాశముంది. 40ఎకరాల స్థలంలో రెండెకరాల విస్తీర్ణంలో జీ౦2 అంతస్తుల్లో రూ. 33కోట్ల అంచనాతో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కానీ.. పూర్తయ్యేవరకు వ్యయం రూ. 50కోట్లకు చేరుకుంది. షాపూర్‌జీ పల్లోంజీ సంస్థ నిర్మాణ పనులను దక్కించుకుంది. అగ్రిమెంట్ చేసుకున్న తేదీ నుంచి 11 నెలల్లో నిర్మాణ సంస్థ పనులు పూర్తిచేయాల్సి ఉంది. అయితే ప్రభు త్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోవ డంతో పనుల్లో జా ప్యమైంది.

# తూనికలు కొలతలు..
# పట్టని ప్రజల వెతలు

నిర్మల్ : నిత్యజీవితంతో మమేకమైన అనేక సేవలు తూనికలు- కొలతల శాఖతో ముడిపడి ఉన్నాయి. ప్రజలకు నాణ్యమైన సరకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, తూనికల్లో మోసాలను నివారించడం, అతిక్రమించినవారిపై కేసులు నమోదు చేయడం ఇతరత్రా పనులను చేపట్టాల్సిన శాఖ ఇది. అయితే ప్రస్తుతం ఇది నామ్‌కేవాస్తేగా మారింది. సిబ్బంది కొరత ప్రధాన కారణం కాగా, ఉన్న సిబ్బంది సైతం సక్రమంగా పని చేయలేని పరిస్థితి.తనిఖీలు అంతంతమాత్రమే.. పెట్రోలు బంకులో పెట్రోలు బదులుగా నీళ్లు పోశారంటూ ఇటీవల మామడ మండలంలో కొందరు వినియోగదారులు ఆందోళన చేపట్టారు. ఇంధనం పోయించుకొని వెళ్లాక బైకులు నడవకుండా మొరాయించడంతో ఈ విషయం బయటపడింది. కొన్నిచోట్ల తక్కువగా పెట్రోలు పోస్తూ మోసగిస్తున్నారని, కనీస సౌకర్యాలు కల్పించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అనుమతులున్న వ్యక్తులే వెండి, బంగారం, ఆభరణాలు విక్రయించాల్సి ఉన్నా కొందరు ఇష్టారీతిన విక్రయిస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొడ్తున్నారనే ఫిర్యాదులున్నాయి. ఇలాంటి అంశాలన్నింటినీ నివృత్తి చేస్తూ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఈ శాఖ అధికారులదే. కానీ, అది ఆచరణలో కనిపించడం లేదు. కొత్తగా వచ్చిన వస్తుసేవల పన్నువిధానంతో వాణిజ్యపన్నులశాఖ అధికారుల బాధ్యతలు మారిపోయాయి. దీంతో వినియోగదారులు నష్టపోకుండా, వ్యాపారుల అక్రమాలను అరికట్టేందుకు తూనికల- కొలతలశాఖ అధికారుల పనితీరు కీలకంగా మారింది. జిల్లా పరిధిలో నిర్మల్, భైంసా మార్కెట్లు పెద్దవి. వాణిజ్య, వ్యాపార సముదాయాలు ఎక్కువగా



ఉంటాయి. హెూటళ్లు, పెద్దపెద్ద కిరాణదుకాణాలు, వాహన షోరూంలకు కొదవలేదు. తనిఖీలు, తదనంతర చర్యలు కనిపించకపోవడంతో వినియోగదారులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదు. బంగారు, వెండి వర్తకుల్లో కొందరు తమ అనుమతులు పునరుద్ధరించుకోవడం లేదు. తూనిక రాళ్లను క్రమం తప్పకుండా రెన్యువల్ చేయాల్సి ఉన్నా పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారనే వాదనలున్నాయి. ఎటొచ్చి అమాయక వినియోగదారుడే నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఇన్‌ఛార్జే దిక్కు..

నూతనంగా ఏర్పడిన నిర్మల్ జిల్లాలో 19 మండలాలున్నాయి. వీటి పరిధిలో పర్యవేక్షణకు ఈ కార్యాలయంలో ప్రస్తుతం ముగ్గురు ఉద్యోగులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఇందులో ప్రధానమైన అధికారి ఇన్‌ఛార్జి కాగా, మరొకరు సాంకేతిక సహాయకుడు, అటెండర్. ఈ ముగ్గురే కార్యాలయ పనితీరుకు ఆధారమయ్యారు. అటెండర్ ఎలాగూ కార్యాలయ నిర్వహణ పనులు చూసుకోవాల్సి ఉంటుంది. అధికారి, సాంకేతిక సహాయకుడు ఇద్దరూ తనిఖీలు చేపట్టడం, సాంకేతికపరంగా ఉన్న లోటుపాట్లను గుర్తించడం, కేసులు నమోదుచేయడం, జరిమానాలు విధించడం, అధికారిక సమావేశాలకు హాజరవ్వడం, ప్రగతి నివేదికలు రూపొందించడం ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించాలి. కరీంనగర్‌కు చెందిన అధికారికి ఇక్కడి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఫలితంగా జిల్లాలోని అన్ని మండలాలను తిరుగుతూ పర్యవేక్షణ చేపట్టడం కష్టసాధ్యంగా మారింది. వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఎవరైనా సెలవుపెడితే పరిస్థితి మరింత దారుణం. గుర్తించడమూ కష్టమే..ప్రభుత్వ కార్యాలయాలంటే ప్రజలకు అందుబాటులో ఉండాలి. వివిధ అవసరాల నిమిత్తం వచ్చేవారు సులభంగా గుర్తించేలా ఏర్పాటుచేయాలి. కానీ, జిల్లాకేంద్రంలో ఉన్న తూనికలు-కొలతలశాఖ కార్యాలయాన్ని చాలామంది గుర్తించలేని స్థితిలో ఉంది. స్థానిక చైన్‌గేట్ ప్రాంతంలోని ఓ అద్దెభవనంలో ప్రస్తుతం కొనసాగుతోంది. ఇప్పటికే చూసినవారు మినహాయిస్తే కొత్తవారు దీన్ని గుర్తించడం కాసింత కష్టమే. ఎవరైనా ఫిర్యాదు చేయాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

మా వంతు ప్రయత్నం చేస్తున్నాం : - రవీందర్, జిల్లా ఇన్‌ఛార్జి అధికారికరీంనగర్‌లో పోస్టింగ్ అయినా జగిత్యాల, నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి బాధ్యతలు అదనంగా అప్పగించారు. అన్ని చోట్లకు తిరగడం కాస్త కష్టమైన విషయం. వారంలో రెండు, మూడు రోజులు వచ్చి తనిఖీలు చేపట్టడం, అనుమతులు పునరుద్ధరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సిబ్బంది కొరత, అదనపు బాధ్యతల కారణంగా పూర్తిస్థాయిలో న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది.

## గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు

యాచారం : ఇబ్రహీంపట్నంలో పోచమ్మ బోనాలు జరిగా యి. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కృప ప్రజలపై ఉండాలని, పాడి పంటలతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు భాస్కర్, ప్రసన్న చిన్న, నాయకులు మహేష్‌గౌడ్, మల్లేష్, రాజు, టోని, మహేష్, రాము పాల్గొన్నారు. బృందావన్ కాలనీలో పోచమ్మ బోనాలు జరిగాయి. ఆలయ చైర్మన్ ఆనంద్‌కుమార్, కౌన్సిలర్ మమత కాలనీ వాసులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో పోచమ్మ తల్లి బోనాలను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, టీఆర్ఎస్ యువ నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి(బంటి), వైస్‌ఎంపీపీ వెంకటప్రతా ప్‌రెడ్డి, సర్పంచ్ అశోక్‌వర్ధన్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అలాగే ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధి మంగళ్లపల్లిలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. యాచారం మండలం మేడిపల్లి, యాచారం, మొండిగౌరెల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో పోచమ్మ బోనాలను నిర్వహించారు. షాబాద్ మండలం మల్లారెడ్డిగూడ, సంకేపల్లిగూడ గ్రామాల్లో మల్లన్న బోనాలు, ఏట్ల ఎర్రవల్లిలో పోచమ్మ బోనాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎంపీటీసీ చెన్నయ్య, సర్పంచ్‌లు అనితసురేందర్‌రెడ్డి, జంగయ్య, కుమ్మరి దర్శన్, గోవర్ధన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, గణేషగౌడ్, మాధవరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, ఎం.వెంకటయ్య, రాఘవరెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కందుకూరు మండలం లేమూరు, దాసర్లపల్లి, మాదాపురం, నేదునూరు గ్రామాల్లో బోనాలను జరుపుకున్నారు. మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, మల్లన్న దేవతలకు బోనాలు సమర్పించారు. సర్పంచ్‌లు జె.పరంజ్యోతి, పి.బాలమణిఅశోక్, సాయిలు, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.



# శ్వేతసౌధంలో.. నాటునాటు..!

శ్వేతసౌధంలో భారత ప్రధాని మోదీ గౌరవార్థం ఏర్పాటు చేసిన విందులో సరదా సన్నివేశాలు చోటుచేసుకొన్నాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన తాతగారు చెప్పిన మాటలను అతిథులతో పంచుకున్నారు. 'టోస్ట్' సంప్రదాయాన్ని ఎలా పాటించాలనే దానిపై అధ్యక్షుడు బైడెన్ ప్రధాని మోదీకి వివరించారు. అధికారిక విందు సందర్భంగా జో బైడెన్ టోస్ట్‌కు పిలుపునిచ్చే సమయంలో మాట్లాడుతూ "మిస్టర్ పీఎం.. మీరు ఆల్కహాల్ తీసుకోకపోతే ఎడమ చేత్తో టోస్ట్ గ్లాస్ తీసుకోవాలి. ఈ విషయాన్ని మా తాతయ్య ఆంబ్రోస్ ఫెన్నిగాన్ చెప్పేవారు. నేను జోక్ చేయడంలేదు. జిల్, నేను నేడు ప్రధాని మోదీతో అద్భుతంగా గడిపాం. ఇది చాలా ఫలవంతమైన పర్యటన. ఈరోజు రాత్రి అమెరికా- భారత్ మధ్య ఉన్న గొప్ప మైత్రిని గౌరవించుకొంటున్నాం" అని పేర్కొన్నారు. ఆ సమయంలో ప్రధాని మోదీ పక్కనే కుడిచేత్తో గ్లాస్ పట్టుకొని నవ్వుతూ ఉండిపోయారు. శ్వేతసౌధంలో అధికారిక విందు సందర్భంగా ప్రధాని మోదీ 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని ఆస్కార్ గెలుపొందిన 'నాటు నాటు' పాటను ప్రస్తావించారు. "గడిచే ప్రతి రోజునూ.. భారత్, అమెరికన్లు పరస్పరం మరింత మెరుగ్గా అర్థం చేసుకొంటున్నారు. హాలోవిన్ రోజున భారత్‌లో పిల్లలు స్పైడర్‌మెన్‌గా మారిపోతున్నారు. మరోవైపు అమెరికాలో యువత 'నాటు నాటు' ట్యూన్లకు స్టెప్పులేస్తున్నారు" అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగం ముగింపులో టోస్ట్‌కు పిలుపు ఇస్తూ.. "మన అద్భుతమైన అతిథులు, అధ్యక్షుడు జో బైడెన్, జిల్ బైడెన్ కోసం టోస్ట్. మంచి ఆరోగ్యం, శ్రేయస్సు, సంతోషం, స్వేచ్ఛ, సమానత్వం, భారత్–అమెరికా స్నేహ సంబంధాలకు టోస్ట్" అని మోదీ అన్నారు. అంతేకాదు.. తన పర్యటనపై అమెరికా ప్రథమ మహిళ జిల్ బైడెన్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి విజయవంతం చేశారని తెలిపారు. జో బైడెన్ దంపతులు అద్భుతమైన విందు ఇచ్చారన్నారు. నిన్న సాయంత్రమే మీ ఇంటి ద్వారాలను నాకోసం తెరిచారని.. ఇరు దేశాల ప్రముఖులతో నేటి సాయంత్రాన్ని మరింత ప్రత్యేకంగా మార్చారని మోదీ పేర్కొన్నారు.

**మోదీ ప్రసంగంలో కీలక అంశాలు..** అమెరికా సమాజానికి భారత్ నుంచి వలస వచ్చిన వారి సేవలను మోదీ ప్రశంసించారు. వారు సమాజానికి, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడుతున్నారని తెలిపారు. విభిన్న జాతులతో కూడిన అమెరికాలో వారు గౌరవప్రదమైన స్థానం పొందారన్నారు. ఎక్కడ పనిచేసినా వారు ప్రత్యేక ముద్రవేస్తున్నారని కొనియాడారు. భారత్‌లో జరగనున్న ప్రపంచకప్ క్రికెట్‌లో క్వాలిఫై అయ్యేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా జట్టుకు అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. బైడెన్ చాలా మృదుభాషి అని మోదీ అభివర్ణించారు. కానీ, పనిచేసే సమయంలో ఆయన చాలా బలమైన వ్యక్తి అని పేర్కొన్నారు.



# జిమ్‌కి వెళ్లొస్తుండగా చంపేశారు

కడప: కడప వైకాపాలో వర్గపోరు నిండు ప్రాణాన్ని బలిగొంది. పట్టపగలే నడిరోడ్డుపై దారుణ హత్య కలకలం రేపింది. సంధ్య కూడలి వద్ద ఇద్దరు గుర్తుతెలియని దుండగులు బురా? ధరించి వైకాపా కార్యకర్త, ఆర్టీసీ ఛైర్మన్ మల్లిఖార్జున రెడ్డి అనుచరుడు శ్రీనివాసులు రెడ్డిని కత్తులతో దాడి చేసి చంపేశారు. భూతగాదాలే హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడపకు చెందిన శ్రీనివాసులు రెడ్డికి మరి కొంతమందితో భూతగాదాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఇవాళ జిమ్ నుంచి ఇంటికి వస్తున్న సమయంలో శ్రీనివాసులుని ఇద్దరు వ్యక్తులు బురా? ధరించి వచ్చి.. విచక్షణా రహితంగా కత్తులతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసులు రెడ్డి మృతి చెందారు. ఆర్టీసీ ఛైర్మన్ మల్లిఖార్జున్ ఆస్పత్రికి చేరుకుని హత్యకు గల కారణాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఏపీ భూములపై తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన మంత్రి అమర్నాథ్

అనకాపల్లి: తెలంగాణ రాష్ట్రంలో అమరజ్యోతి ప్రారంభోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని భూములపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఏపీ మంత్రులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. తెలంగాణలో కంటే ఏపీలోనే భూముల ధరలు ఎక్కువని చెప్పుకొస్తున్నారు. తాజాగా ఈ విషయంపై మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. ఏపీలో కంటే తెలంగాణలో భూముల రేట్లు ఎక్కువగా ఉన్నాయని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎక్కడో చెప్పిన మాటలను కేసీఆర్ కాపీ కొట్టి అవే మాటలను అనడం సిగ్గుచేటని విమర్శించారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం వచ్చి ల్యాండ్ రేట్లు తెలుసుకొని మాట్లాడాలన్నారు. ఇక్కడ ఎకరా రేట్‌కు తెలంగాణలో 150ఎకరాలు కొనొచ్చు అని.. ఈ విషయం తెలంగాణ ముఖ్యమంత్రి తెలుసుకోవాలి అంటూ హితవుపలికారు. శుక్రవారం యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలంలో గడపగడపకు వైసీపీ విజయోత్సవ సభలో మంత్రి అమర్‌నాథ్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

**కేసీఆర్ ఏమన్నారంటే...** తెలంగాణలో ఎకరం అమ్మితే ఆ డబ్బుతో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో వందెకరాలు కొనొచ్చని ముఖ్యమంత్రి



కేసీఆర్ అన్నారు. రాష్ట్రం ఏ స్థాయిలో అభివృద్ధి చెందిందనేది దీని ద్వారానే తెలుస్తోందన్నారు. ఇటీవల తెలంగాణ అభివృద్ధి చెందుతోందంటూ.. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణలో ఎకరం భూమి అమ్మితే ఆంధ్రాలో యాభై ఎకరాలు కొనవచ్చునని ఇటీవల చంద్రబాబు అన్నారని గుర్తు చేశారు. చంద్రబాబు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడకూడదని కోరుకున్నారని, ఇప్పుడు ఆయనే తెలంగాణ అభివృద్ధి చెందుతోందని, ఏపీ వెనుకబడుతోందని అంటున్నారని.. ఆయన ఈ వ్యాఖ్యలు వాస్తవమేనని పేర్కొన్నారు.

# జవాబుదారీతనం..అభివృద్ధికి నూతన నిర్వచనం 'జగనన్న సురక్ష'



తాడేపల్లి: జవాబుదారీతనం..అభివృద్ధికి నూతన నిర్వచనం 'జగనన్న సురక్ష' కార్యక్రమమని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడారు.

**మంత్రి ఆదిమూలపు సురేష్ ఏమన్నారంటే..** నిత్యం ప్రజల సంతోషం కోసం పరితపిస్తూ..మనమంతా ప్రజా సేవకులమని, జనానికి మనం జవాబుదారీతనంతో పని చేద్దామని మమ్మల్ని నడిపిస్తూ..రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న మనసున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి, సహచర మంత్రులకు, అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రతిపక్షాలు ఎన్ని చేసినా, ఎంత భారమైనా భరిస్తూ పసిబిడ్డలను దగ్గర నుంచి పండు ముసలి వరకు ఉపయోగపడే ఎన్నో పథకాలు వైయస్ జగన్ గారు తీసుకువచ్చారు. ఒక నానుడి ఉంది..అడగనిదే అమ్మైనా అన్నం పెట్టదు. కానీ అడగకముందే జనం సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్న జగనన్నకు జనం జేజేలు పలుకుతున్నారు. ఎన్నో పథకాలకు రూపుకల్పన చేస్తూ పథకాలను కొనసాగిస్తున్న వైయస్ జగన్‌కు ఎన్ని జన్మలు ఎత్తినా కూడా మీకు రుణపడి వుంటారు. ఈ రోజు ప్రజల కోసం మరో చారిత్రత్మాక కార్యక్రమం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్న శుభ తరుణంలో మీకు రాష్ట్ర ప్రజలందరి తరఫున మనస్ఫూర్తిగా కృతజ్ఞతల తెలియజేస్తున్నా సర్.. ఇప్పటికే మమ్మల్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు పంపించి వారి సమస్యలు తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇంకా ఒక అడుగు ముందుకు వేస్తూ ప్రజలు వారి సమస్యలు సీఎం కు చెప్పుకునేలా జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పుడు జగనన్న సురక్ష ద్వారా ఇంకా పరిష్కారం కాని సమస్యలకు జవాబుదారితనంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. జవాబుదారీతనం అంటే ఏంటి? అభివృద్ధి అంటే ఏమిటి అనే దానికి నూతన నిర్వచనం పలుకుతూ వైయస్ జగన్ చేస్తున్న కార్యక్రమాలు యావత్ భారత దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని సవినయంగా మనవి చేస్తున్నాను. ఇటువంటి కార్యక్రమాల్లో నన్ను కూడా భాగస్వామిని చేసినందుకు నా జన్మధన్యమైంద. జన్మజన్మలకు మీకు రుణపడి ఉంటానని, ఇటువంటి నాయకుడి వద్ద పని చేయడం గర్వంగా ఫీల్ అవుతున్నానని మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు.

# జగనన్న సురక్షపై నక్కా ఆనందబాబు సెటైర్లు



అమరావతి: జగనన్న సురక్ష కార్యక్రమంపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు విమర్శలు గుప్పించారు. ఆయన మీడియాతో మాట్లాడారు. "సురక్షా కార్యక్రమం వల్ల వైసీపీ నేతలకే సురక్షా.. పేదలకు కాదు. గడపగడపకు కార్యక్రమంలో ప్రజల నుంచి వైసీపీ ఎమ్మెల్యేలకు ఛీత్కారాలు ఎదురయ్యాయి. జగన్ రక్షణ కోసమే సురక్షా కార్యక్రమం. రక్ష.. సురక్షా కార్యక్రమాలు జగన్‌ను రక్షించలేవు. కరోనాను అడ్డం పెట్టుకుని కూడా వైసీపీ నేతలు దోచుకున్నారు. ఏపీలో ప్రజలు సురక్షితంగా ఉన్నారా..? ఈరోజు ఓ సంఘటన జరిగితే.. మర్నాడే మరో సంఘటన జరుగుతోంది.. ఇంకేం సురక్ష. అధికార పార్టీ ఎంపీకే రక్షణ లేదు.. ఇంకేం సురక్ష." అంటూ ఎద్దేవా చేశారు. "బాపట్ల జిల్లాలో పదో తరగతి బాలుడిపై పెట్రోల్ పోసి చంపితే దిక్కు లేదు.. ఇదేనా సురక్ష. కోటిన్నర మంది లబ్దిదారులను మోసం చేశారు. పింఛన్, తెల్ల రేషన్ కార్డులు కోత వేశారు. అమ్మఒడిలో లక్షల మంది పిల్లలను మోసం చేశారు. ఉచిత విద్యుత్ స్కీం నుంచి చాలా మంది ఎస్సీలను పక్కకు తప్పించారు. ప్రతి పథకంలోనూ భారీగా కోతలేశారు. ఎస్సీ పథకాలు రద్దు చేశారు.

బతకడానికి స్వేచ్ఛ లేదు.. పథకాల్లో కోతలు వేశారు.. ఇంకా సురక్షా అంటారా?. అమరావతి నగరాన్ని నిట్ట నిలువునా చంపేశారు. జగన్ లాంటి సీఎంను స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చూడలేదు. గంజాయి స్మగ్లింగ్ చేసి వైసీపీ నేతలు కోట్లు దండుకుంటున్నారు. ఇంత జరిగితే డీజీపీ ప్రశాంతంగా ఉందంటూ కామెంట్లు చేస్తున్నారు. ఎన్ని కొత్త ఎత్తుగడలు వేసినా ప్రజలు వైసీపీని తరిమి కొట్టడం ఖాయం." అని నక్కా ఆనందబాబు జోస్యం చెప్పారు.

# ముద్రగడ గారూ మీది పోరబాటా లేక గ్రహపాటా... బుద్దా వెంకన్న లేఖ



అమరావతి: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంపై టీడీపీ నేత బుద్దా వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. ముద్రగడకు బహిరంగ లేఖ రాశారు. "ముద్రగడ గారూ మీది పొరబాటా లేక గ్రహపాటా. 1995లో ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు గారిని 1993–94లో ఎలా కలుస్తారు. ఈ లేఖ మీరు రాసిందా లేక జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిందా. 1993–94 లో పత్తిపాడు ఎమ్మెల్యేగా మీరు, ముఖ్యమంత్రిగా కోట్ల విజయ భాస్కర రెడ్డి గారు ఉన్నారు. మీరు చెబుతున్న కేసులు అప్పుడు మీరు శాసనసభ్యులుగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పెట్టిన కేసులే అని మరచిపోయారా.

అప్పుడు విషయం చంద్రబాబుకు ఆపాదించడం పొరబాటు కాదా. మీరు ఈ లేఖలతో ఎందుకు జరగని విషయాలను జరిగినట్లు ప్రస్తావిస్తున్నారు. ఎందుకు మీరు చంద్రబాబును ప్రతి విషయంలో లాగుతున్నారు. రాజకీయంగా ఏదన్నా మాట్లాడండి తప్పు లేదు.. కానీ చంద్రబాబుకు కులాన్ని ఆపాదించకండి. ఆయన అన్ని కులాలను సమానంగా చూస్తారు.. చూశారు. సంక్షేమ పథకాలను అమలు చేశారు" అని బుద్దా వెంకన్న లేఖలో పేర్కొన్నారు.

# చంద్రబాబు.. దమ్ముంటే నాతో డెబిట్‌కు రా.. పవన్ అమ్ముడుపోయారన్న పాల్

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రావణకాష్టంగా మారిందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డిని కలవడానికి వెళ్ళానని.. కానీ ఆయన అక్కడ లేరని అన్నారు. కేతిరెడ్డి విడుదల చేసిన ఆడియో చూసి షాక్ అయ్యానన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లా 100 మంది బౌన్సర్లతో.. చంద్రబాబులా హై సెక్యూరిటీతో తిరగడంలేదు.. సింగిల్‌గా వెళుతున్నానని అన్నారు. "చంద్రబాబు.. దమ్ముంటే నాతో డెబిట్‌కు రా.. ఎలాగూ లోకేష్‌కు మాట్లాడడం రాదు. పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర వదిలేసి లోకేష్ కోసం నారాహి యాత్ర చేస్తున్నాడు. మాటలు రాని పప్పును సీఎం చెయ్యడానికి చంద్రబాబు అవస్థలు. 15 సీట్లకు పవన్ కళ్యాణ్ అమ్ముడుపోయాడు.. దమ్ము ఉంటే 175 స్థానాల్లో పోటీ చెయ్యి. పవన్ కళ్యాణ్.. ప్రజాశాంతి పార్టీలోకి నీ పార్టీని విలీనం చెయ్యి. 2008లో పార్టీ పెట్టిన చిరంజీవి వెంట వెళ్లిన బీసీ, ఎస్సీ, ఎస్టీలు కొన్ని కోట్ల రూపాయలు నష్టపోయారు" అని విమర్శించారు. పవన్ కళ్యాణ్ ఓ ప్యాకేజి స్టార్ అని అన్నారు. నన్ను ఓ కామెడీలా కొన్ని



మీడియాలు చూపిస్తున్నాయని మండిపడ్డారు. ఆదాని, అంబానీలతో నార్త్ మీడియాను మోడీ కొనేశారని ఆరోపించారు.

షర్మిల కాంగ్రెస్‌లో విలీనం, పవన్ కళ్యాణ్ టీడీపీ, బీజేపీలతో విలీనం అంటూ వ్యాఖ్యలు చేశారు. ధర్మవరంలో జనాలను చూసి షాక్ అయ్యా.. కేతిరెడ్డి వద్దు, బాబు వద్దు మీరు సీఎం కావాలని అన్నారన్నారు. 100 వాగ్దానాలు చేసిన చంద్రబాబు ఒక్కటి కూడా నెరవేర్చలేదని కేఏపాల్ విమర్శలు గుప్పించారు.


# శ్రీ వాణి ట్రస్టు ద్వారా రూ. 861 కోట్ల నిధులు.. శ్వేతపత్రం విడుదల

తిరుమల: శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టుకు (శ్రీవాణి ట్రస్ట్) భక్తులు అందించిన విరాళాలపై టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం శ్వేతపత్రం విడుదల చేశారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం ఈవో ధర్మారెడ్డితో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. టీటీడీ బోర్డు తీర్మానం నం.388 ప్రకారం సనాతన హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా పురాతన దేవాలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాలు, చిన్న ఆలయాల, భజనమందిరాలు నిర్మాణానికి తోడ్పాటును అందించే ప్రధాన లక్ష్యంతో 2018 ఆగస్టు 28న శ్రీవాణి ట్రస్టు ఏర్పాటైయిందని తెలిపారు. 2019 సెప్టెంబర్ 23న బోర్డు తీర్మానం 23 ప్రకారం శ్రీవాణికి రూ.10,000/- విరాళం ఇచ్చిన దాతలకు ఒకసారి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందన్నారు. అప్పటినుండి ట్రస్టు వాస్తవ కార్యాచరణ ప్రారంభమైందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార కాలనీల్లో ఆలయాల నిర్మాణానికిగాను టీటీడీ చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమానికి నిధులు వెల్లువెత్తాయని... ఈ ఏడాది మే 31వ తేదీ వరకు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో భక్తులు శ్రీవారికి రూ. 861 కోట్లకు పైగా విరాళాలు అందించారని పేర్కొన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా 8.25 లక్షల మంది భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. 176 పురాతన ఆలయాల పునరుద్ధరణకు రూ. 93 కోట్లు మంజూరు చేశామని, వెనుకబడిన ప్రాంతాల్లో ఒక్కొక్కటి రూ.10 లక్షల వ్యయంతో మొత్తం 2,273 ఆలయాల నిర్మాణానికి ఆమోదం తెలిపామని చెప్పారు. వీటిలో 1953 ఆలయాలను ఏపీ దేవాదాయ శాఖ, 320 ఆలయాలను సమరసత సేవ ఫౌండేషన్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల్లో 127 ప్రాచీన ఆలయాల పునరుద్ధరణకు రూ.139 కోట్లు కేటాయించామన్నారు. టీటీడీ పరిపాలన పూర్తి పారదర్శకంగా నడుస్తోందని, ఇందులో భాగంగా



ఇప్పటికే టీటీడీ ఆస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం డిపాజిట్లపై శ్వేతపత్రం విడుదల చేశామని ఛైర్మన్ చెప్పారు. ప్రస్తుతం శ్రీవాణి ట్రస్ట్ నిధుల వినియోగంపై శ్వేతపత్రాన్ని విడుదల చేశామన్నారు. శ్రీవాణి నిధుల వినియోగంపై సందేహాలను నివృత్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, నిధులు దుర్వినియోగం అవుతున్నాయని కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న నిరాధార ఆరోపణలను నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ నిధులను పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణాలకు వినియోగిస్తున్నామని పునరుద్ఘాటించారు. ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్టు నిధుల వ్యవహారంపై కొందరు పీఠాధిపతులు, వీహెచ్‌పీ నేతలు తనను కలిసినప్పుడు అన్ని పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బ్యాలెన్స్ మొత్తం వివరాలు చూపానన్నారు. ఈ వివరాలపై విశ్వహిందూ పరిషత్ సెంట్రల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు రాఘవులు కూడా పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. ఎవరైనా నిరాధార ఆరోపణలు చేసే ముందు లక్షలాది మంది భక్తుల మనోభావాలు దృష్టిలో ఉంచుకోవాలని, ఇలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అలా అయితేనే స్వయం సమృద్ధి భారత్ సాధ్యం: గడ్కరీ



ముంబయి: సామాజిక ఆర్థిక అసమానతలకు స్వస్తి చెబితేనే 'స్వయం సమృద్ధి భారత్' సాధ్యమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. వ్యవసాయ, గ్రామీణ, గిరిజన రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని తెలిపారు. జీడీపీలో వీటి వాటా ప్రస్తుతం ఉన్నదానితో పోలిస్తే రెట్టింపు కావాల్సిన అవసరం ఉందన్నారు. 2020లో కేంద్ర ప్రభుత్వం 'స్వయం సమృద్ధి భారత్' లక్ష్యాన్ని నిర్దేశించుకున్న విషయం తెలిసిందే. ఆర్‌బీఐ గవర్నర్లపై ప్రచురించిన ఓ పుస్తకాన్ని విడుదల చేస్తూ గడ్కరీ శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేశారు. కాలం గడుస్తున్న కొద్దీ సామ్యవాద, కమ్యూనిస్టు సిద్ధాంతాలు పూర్తిగా కనుమరుగవుతున్నాయని గడ్కరీ అన్నారు. పార్లమెంటులో సీపీఐ, సీపీఐ(ఎం) సభ్యుల సంఖ్య క్రమంగా పడిపోయిందని తెలిపారు. భాజపా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చైనాలో పర్యటించిన రోజులను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. చైనాలో కేవలం జెండాలు మాత్రమే ఎరుపు రంగులో మిగిలిపోయాయని వ్యాఖ్యానించారు. ఆర్థిక వృద్ధి కోసం పూర్తిగా మార్కెట్ కేంద్రీకృత విధానాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పరోక్షంగా ఆర్థిక విధానాల్లో సామ్యవాదానికి స్వస్తి పలికారని అభిప్రాయపడ్డారు. భారత్‌ను ఆర్థిక శక్తిగా మార్చే దిశగా విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని గడ్కరీ అన్నారు. ఈ క్రమంలో నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ఫలితాలిచ్చే రంగాలను గుర్తించి వాటికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వ్యాఖ్యానించారు. కేవలం ఆర్థికపరమైన వ్యవహారాలపైనే కాకుండా పనితీరుపై కూడా ఆడిట్ జరగాల్సిన అవసరం ఉందన్నారు. పరిమిత స్థాయిలో ఆర్థిక వనరులున్న సమయంలో 'పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య' విధానాన్ని అవలంబించాలన్నారు.

# ఏపీ టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల..



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం ఉదయం రిలీజ్ అయ్యాయి. జూన్ రెండు నుంచి పదో తేదీ వరకు జరిగిన టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.87 లక్షల మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసిన సంగతి తెలిసిందే. వీళ్లలో పాసైన విద్యార్థుల సంఖ్య 118588. టెన్త్ సప్లిమెంటరీ 2023 ఫలితాల్లో.. ఉత్తీర్ణతా శాతం - 63.10%, హాజరైన బాలురు- 110210...ఉత్తీర్ణత సాధించిన బాలురు 65372, హాజరైన బాలికలు- 77713....ఉత్తీర్ణత సాధించిన బాలికలు- 53216, బాలురు కంటే 9.16% అధికంగా బాలికల ఉత్తీర్ణత, అత్యధికంగా ప్రకాశంలో 91.21% ఉత్తీర్ణత, అత్యల్పంగా కృష్ణాలో 40.56% ఉత్తీర్ణత.

## త్రిష సూపర్ మోడ్రన్ లుక్ అదుర్స్

1999 లో జోడీ సినిమాలో చిన్న పాత్రలో నటించిన త్రిష హీరోయిన్ గా మొదటి సినిమాను 2002 సంవత్సరంలో చేసింది. అంటే త్రిష సినీ కెరీర్ ను ప్రారంభించి రెండు దశాబ్దాలకు పైగా పూర్తి అయ్యింది. సాధారణంగా హీరోయిన్స్ అయిదు పది సంవత్సరాలు కొనసాగడం గొప్ప విషయం. హీరోలతో పోల్చితే హీరోయిన్స్ కెరీర్ స్పాన్ చాలా తక్కువగా ఉంటుంది. కానీ త్రిష విషయంలో ఆ విషయం తప్పు అని తేలిపోయింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలకు పైగా పూర్తి అయినా కూడా త్రిష జోరు చూస్తూ ఉంటే



ఆశ్చర్యంగా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. త్రిష ప్రస్తుతం చేస్తున్న సినిమాలు చాలానే ఉన్నాయి. ఇటీవల ఆమె నటించిన పొన్నియిన్ సెల్వన్ 2 సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో ఐశ్వర్య ను మించి త్రిష అందంగా కనిపించిందంటూ ఆమె అభిమానులు మాట్లాడుకుంటున్నారు. త్రిష అందం గురించి ఎంత మాట్లాడుకున్నా తక్కువే అవుతుందని ఈ ఫోటోను చూస్తే మరోసారి అర్థం అవుతుంది. స్టైలిష్ కూల్ డ్రెస్ లో అంతకు మించిన స్టైలిష్ షేడ్స్ ను ధరించిన త్రిష స్టైల్ ను చూసి ఎంతటి వారైనా పడిపోవాల్సిందే. ఆ నిలబడిన స్టైల్ మరియు ఆమె బాడీ లాంగ్వేజ్ లో ఉన్న స్టైల్ కు అభిమానులు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరు కూడా లైక్ కొట్టకుండా ఉండలేక పోతున్నారు. ఈ స్థాయిలో అందంగా ఉంటుందే కనుకే నాలుగు పదుల వయసులో కూడా త్రిష ఫుల్ బిజీగా ఉంది. పొన్నియిన్ సెల్వన్ 2 సినిమా సూపర్ హిట్ అవ్వడంతో తమిళంలో ఈమె ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంటుంది. ఇదే సమయంలో ఈమె మరింతగా తన పారితోషికంను పెంచినట్లుగా వార్తలు వస్తున్నాయి.

## శృతి నిర్ణయంపై విభిన్న అభిప్రాయాలు..!

కమల్ కూతురిగా వచ్చీ రాగానే స్టార్ క్రేజ్ తెచ్చుకుంటుంది అనుకున్న శృతి హాసన్ కెరీర్ మొదట్లో హిట్ కోసం చాలా కాలం ఎదురు చూడాల్సి వచ్చింది. అటు తమిళ్ ఇటు తెలుగులో సినిమాలు చేస్తున్నా హిట్ జోష్ ఇవ్వలేదు. అయితే పవర్ స్టార్ సినిమాతో బ్లాక్ బస్టర్ బోణీ కొట్టేసింది అమ్మడు. పవన్ కళ్యాణ్ తో గబ్బర్ సింగ్ సినిమా చేసిన శృతి హాసన్ ఆ సినిమా హిట్ అమ్మడి ఫేట్ మార్చేసింది. తెలుగు లో అప్పటివరకు శృతి ని తీసుకోవాలా వద్దా అనుకున్న వారంతా ఆమె కోసం క్యూ కట్టారు. తెలుగు లో ఆమె క్రేజ్ చూసి కోలీవుడ్ లో కూడా వరుస ఛాన్స్ లు ఇచ్చారు. మధ్యలో తెలుగు సినిమాలను నిర్లక్ష్యం చేస్తుంది అన్న వార్తలు రాగా మళ్లీ క్రాక్ వకీల్ సాబ్ సినిమాలతో అమ్మడు అలరించింది. ఇక ఈ ఏడాది సంక్రాంతి



కి పోటా పోటీగా వచ్చిన వాల్తేరు వీరయ్య వీర సింహా రెడ్డి రెండు సినిమాల్లో శృతి హాసన్ హీరోయిన్ గా నటించింది. ఈ రెండు సినిమాల సక్సెస్ ఆమెకు మరింత జోష్ ఇచ్చింది. సీనియర్ హీరోల సరసన తాను హీరోయిన్ ఏంటి అని ఆలోచించకుండా శృతి వచ్చిన ఛాన్స్ ని వాడేసుకుంది. ప్రస్తుతం ప్రభాస్ తో సలార్ సినిమా చేస్తున్న శృతి హాసన్ నాని 30వ సినిమాలో కూడా ఒక ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుందని తెలుస్తుంది. సినిమా లో నానికి ఒక ఫ్లాష్ బ్యాక్ లవ్ స్టోరీ ఉంటుందట అందులో శృతి హాసన్ తో నాని లవ్ ట్రాక్ ఉంటుందట. అయితే శృతి హాసన్ ఓ పక్క ప్రభాస్ లాంటి స్టార్ హీరో సినిమాలో మెయిన్ లీడ్ గా చేస్తూ ఇలా నాని సినిమాలో స్పెషల్ రోల్ చేయడం ఆమె ఫ్యాన్స్ ని ఇబ్బంది పెడుతుంది. శృతి అంత ఆలోచించలేనంత అమాయకురాలు కాదు సినిమాలో ఆమె పాత్ర చాలా బాగుంటుంది కాబట్టే నాని సినిమాకు ఆమె సైన్ చేసిందని అంటున్నారు కొందరు. ఏది ఏమైనా నాని తో శృతి హాసన్ ఫస్ట్ టైం స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. దసరాతో నాని తన స్టామినా ఇది అని ప్రూవ్ చేసుకున్నారు. శృతి నాని సినిమాకు సైన్ చేయడం మంచి నిర్ణయమా కాదా అన్నది సినిమా రిలీజ్ అయ్యాక తెలుస్తుంది. ఈ సినిమాను డిసెంబర్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నాడు నాని.




## రష్మిక బిగ్ మూవీ.. ఓ పనైపోయింది








టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన ఈ మధ్య హిందీ లో వరుస ఆకాశాలు అందుకుంటూ స్పీడ్ పెంచుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే బాలీవుడ్ లో రెండు సినిమాలు కంప్లీట్ చేసిన ఈ బ్యూటీ రణబీర్ కపూర్ కి జోడీ గా యానిమల్ లో ప్రస్తుతం నటిస్తోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని టి-సిరీస్ నిర్మిస్తోంది. ఇక ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది.

తాజాగా రష్మిక యానిమల్ షూటింగ్ కి సంబంధించి తన లాస్ట్ డేని కంప్లీట్ చేసింది. ఈ విషయాన్ని ఇన్ స్టాగ్రామ్ లో ఫోటోలు షేర్ చేసుకొని పంచుకుంది. రణబీర్ కపూర్ సందీప్ రెడ్డి వంగా తో పాటు మొత్తం యానిమల్ టీమ్ తో కలిసి దిగిన ఫోటోలని రష్మిక పంచుకున్నారు.

ఈ ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. యానిమల్ షూటింగ్ లో నైట్ షూటింగ్ తో నా లాస్ట్ డే కంప్లీట్ చేసినట్లు రష్మిక మందన అందు లో రాసుకొచ్చింది. తనకి సంబందించిన సీక్వెన్స్ అన్ని పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 50 రోజుల షూటింగ్ షెడ్యూల్ ని ఫినిష్ చేసుకొని ఆమె యానిమల్ టీమ్ కి సెండాఫ్ చెప్పేసి హైదరాబాద్ తిరిగి వస్తోంది. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ చేస్తోన్న పుష్ప 2 మూవీ షూటింగ్ లో ఆమె జాయిన్ కానుంది. ఈ సినిమాకి సంబందించిన బన్నీ రష్మిక మధ్య కీలక ఎపిసోడ్స్ షూటింగ్ చేయడానికి సుకుమార్ ప్లాన్ చేస్తున్నారు. ఇక యానిమల్ సినిమాకి ప్యాకప్ చెప్పిన సందర్భంగా ఫోటోలు పంచుకోవడం తో ఆసక్తికరంగా ఆమె పోస్ట్ కూడా పెట్టారు. ఇప్పటి వరకు యానిమల్ మూవీ కోసం 50 రోజుల షూటింగ్ చేశా ను. ఈ రోజుతో నా పార్ట్ అంతా కంప్లీట్ అయ్యింది. యానిమల్ టీమ్ ని వదిలేస్తూ ఉంటే చాలా లోన్లీగా ఫీల్ అవుతున్నా. ఇన్ని రోజులు చాలా ఇష్టంగా వారి తో కలిసి పని చేశాను. టీమ్ అంతా నన్ను అద్భుతంగా రిసీవ్ చేసుకున్నారు. అందరికి నా గుండెల్లో ప్రత్యేక స్థానం ఉంటుంది. సందీప్ రెడ్డి వంగా గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

అతని మేకింగ్ విజన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. చాలా నిబద్ధతతో పని చేస్తారు. నటులకి కావాల్సినంత స్వేచ్ఛ ఇస్తారు. కచ్చితంగా యానిమల్ లో నా పాత్ర మీ అందరికి నచ్చుతుంది అంటూ రష్మిక రాసుకొచ్చారు. ఈ ఫోటోలు పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది.

## కేరళ చీరలో గోల్డెన్ లెగ్ బ్యూటీ క్లీ వేజ్ షో



భీమ్లా నాయక్ లో రానా కు జోడీగా నటించి మెప్పించిన సంయుక్త మీనన్ ఆ తర్వాత బింబిసార సినిమాలో నటించి సక్సెస్ ను తన ఖాతాలో వేసుకున్న విషయం తెల్సిందే. ధనుష్ కి జోడీ గా సార్ సినిమాలో కూడా నటించి మెప్పించింది. ఆ సినిమా సక్సెస్ ని దక్కించుకుంది. తాజాగా వచ్చిన విరూపాక్ష చిత్రం కూడా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. విరూపాక్ష చిత్రం వంద కోట్ల వసూళ్లు దిశగా దూసుకు పోతుంది. ఈ నేపథ్యంలో లక్కీ బ్యూటీ కాస్త గోల్డెన్ లెగ్ అంటూ సంయుక్త మీనన్ ప్రశంసలు దక్కించుకుంటున్న విషయం తెల్సిందే. ఈ గోల్డెన్ లెగ్ బ్యూటీ అందాల ఆరబోతతో ఎప్పటికప్పుడు అలరిస్తూనే ఉంది. తాజాగా మరోసారి చీర కట్టు లో మెప్పించింది. కేరళ చీర కట్టులో సాధారణంగానే ముద్దుగుమ్మలు చాలా ముద్దుగా ఉంటారు. అలాంటిది సంయుక్త మీనన్ కేరళ చీర కట్టు లో క్లీవేజ్ షో తో అందరిని కూడా సర్ ప్రైజ్ చేస్తోంది. ఆకట్టుకునే ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యింది. ఈ స్థాయి లో అందాలను ఆరబోయడంతో పాటు గోల్డెన్ లెగ్ అంటూ ప్రశంసలు దక్కించుకోవడం తో మరింతగా ఆఫర్లను దక్కించుకుంటూ దూసుకు పోతుంది. ఆకట్టుకునే రూపం ఈ అమ్మడి సొంతం.. అంతే కాకుండా లక్ కలిసి వస్తుండటంతో మళ్లీ మళ్లీ పెద్ద సినిమా ల్లో అవకాశాలు వస్తున్నాయి. తెలుగు మరియు తమిళంలో వరుసగా సినిమాలు చేస్తూ సంయుక్త మీనన్ సందడి చేస్తోంది.

## అక్కడ ఐశ్వర్య దూకుడు..!


చూడగానే మన పక్కింటి అమ్మాయిలా అనిపించే హీరోయిన్స్ కొంతమంది ఉంటారు అందులో ఒకరు తమిళ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. ఒకప్పుడు తెలుగు సినిమాల్లో నటించిన రాజేష్ తనయురాలు ఆమె. సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ శ్రీలక్ష్మికి స్వయానా మేనకోడలు. తమిళ సినిమాలతో పరిచయమై తెలుగులో కూడా సినిమాలు చేస్తూ వస్తుంది. శైలజా కృష్ణమూర్తి మిస్ మ్యాచ్ వరల్డ్ ఫేమస్ లవర్ టక్ జగదీష్ సినిమాల్లో నటించింది అమ్మడు. తనకు ఇచ్చిన క్యారెక్టర్ కి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తున్న అమ్మడు కెరీర్ లో సక్సెస్ జోష్ ని రుచి చూడలేకపోతుంది. సినిమాలు వరుసగా చేస్తున్నా సరే వాటితో అమ్మడికి తగిన ఐడెంటిటీ మాత్రం రావట్లేదు. అయితే ఈ మధ్య సినిమాలతో పాటుగా ఓటీటీ వెబ్ సీరీస్ లలో




కూడా ఐశ్వర్య రాజేష్ ఎక్కువగా కనిపిస్తుంది. ది గ్రేట్ ఇండియన్ కిచెన్ రన్ బేబీ రన్ స్వప్న సుందరి సినిమాలతో ఓటీటీ ఆడియన్స్ ని అలరిస్తుంది ఐశ్వర్య. సినిమా ఎక్కడ పడితే ఏంటి చెప్పండి ఈ సీరీస్ లు చూసిన ఓటీటీ ప్రేక్షకులు ఐశ్వర్యకి మంచి పాత్ర పడితే అదరగొట్టేస్తుందని చెప్పుకుంటున్నారు. హీరోయిన్స్ లో సహజంగా నటించే వారు చాలా తక్కువ. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్స్ కేవలం పాటలకే అంకితం అవుతుంటారు. కానీ ఐశ్వర్య రాజేష్ లాంటి హీరోయిన్స్ కి మంచి స్టోరీ పడితే మాత్రం తప్పకుండా ఆమె లైం లైట్ లోకి వస్తుందని చెప్పొచ్చు. తెలుగులో చేసిన సినిమాలన్నీ నిరాశపరచడంతో ఆమెతో సినిమా అంటే ఎవరు ముందుకు రావట్లేదు. అందుకే వచ్చిన ఛాన్స్ లను వాడుకుంటూ అది సినిమా అయినా ఓటీటీ వెబ్ సీరీస్ అయినా చేస్తూ వస్తుంది ఐశ్వర్య రాజేష్. మరి రాబోతున్న రోజుల్లో అయినా ఐశ్వర్యా రాజేష్ కి మంచి ఆఫర్లు వచ్చి సక్సెస్ ట్రాక్ ఎక్కుతుందేమో చూడాలి.

## అమ్మడు అందం తింటుందో ఏమో..?

2001లో వచ్చిన ఇష్టం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన శ్రియ శరణ్ ని ఇప్పటికీ తెలుగు ఆడియన్స్ ఇష్టపడుతూనే ఉన్నారు అందుకే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి 22 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ఆమెకు అవకాశాలు వచ్చేలా చేస్తున్నారు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా స్టార్స్ అందరితో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్న శ్రియ ఫాం కోల్పోయాం కదా అని సినిమాలకు దూరం కాకుండా వచ్చిన అవకాశాలను చేసుకుంటూ వచ్చింది. ఇక మ్యారేజ్ తర్వాత మరింత కంఫర్ట్ జోన్ లోకి వెళ్లిన శ్రియ సినిమాల పరంగా తనకు వచ్చిన పాత్రలను చేస్తూ అలరిస్తుంది. ఆస్కార్ గెలిచిన ఆర్.ఆర్.ఆర్ సినిమాలో కూడ శ్రియ చిన్న పాత్ర లో మెప్పించింది. రెండు దశాబ్దాల క్రితం హీరోయిన్ గా పరిచయమైన శ్రియ అందంలో ఇప్పటి హీరోయిన్స్ ఏమాత్రం తగ్గకుండా అందాల ప్రదర్శన చేస్తుంది. ఈ మధ్య సినిమాల్లో ఆమెకు గ్లామర్ షోకి ఛాన్స్ దొరక్కపోవడంతో ఫోటో షూట్స్ తో తన గ్లామర్ తో ప్రేక్షకుల కళ్లు జిగేలుమనిపించేలా



చేస్తుంది అమ్మడు. ఇక శ్రియ లేటెస్ట్ ఫోటో షూట్ చూస్తే 40 ఏళ్ల వయసు మీద పడ్డా అందం విషయంలో పదహారణాల పడుచు పిల్లలా కనిపిస్తుంది. శ్రియ లేటెస్ట్ ఫోటోస్ చూసిన వారంతా అమ్మడు అందం తినేస్తుందా ఏంటి అని కామెంట్స్ చేస్తున్నారు. ఇక శ్రియ సినిమాల విషయానికి వస్తే దృశ్యం 2 తో హిందీలో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న శ్రియ కబ్జాలో హీరోయిన్ గా నటించింది. ఇక త్వరలో మ్యూజిక్ స్కూల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. శ్రియ సినిమాల కన్నా ఆమె ఫోటో షూట్స్ తో చేసే గ్లామర్ షోనే ఎక్కువ వార్తల్లో నిలుస్తుంది. ఇప్పటికీ సోలో హీరోయిన్ గా అవకాశం ఇస్తే అందంతో అదరగొట్టేసేలా ఉంది అమ్మడు. ఏది ఏమైనా రెండు దశాబ్దాల తర్వాత ఒక కూతురికి తల్లయ్యాక కూడా శ్రియ చేస్తున్న ఈ మెయింటెనెన్స్ చూసి మిగతా హీరోయిన్స్ షాక్ అవుతున్నారు.




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. విభాగాల వారీగా ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చే అలవెన్స్‌ను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల ప్రకారం ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రావెలింగ్ అండ్ కన్వీయన్స్, సెలవు రోజుల్లో ఉద్యోగులకు, ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే అడ్వాన్స్.. ఇలా పలు రకాల అలవెన్స్‌లను పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.

**జీవో ప్రకారం ఉద్యోగులకు పెరిగేవి ఇవే..** ట్రావెలింగ్ అండ్ కన్వీనియన్స్ అలవెన్స్ – 30శాతం. బదిలీపై వెళ్లే ఉద్యోగులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ – 30శాతం. సెలవురోజుల్లో పనిచేసే లిఫ్ట్ ఆపరేటర్లు, డ్రైవర్లకు అదనంగా రూ. 150 చెల్లింపు. షెడ్యూల్ ఏరియాలో పనిచేసే ఉద్యోగులకు స్పెషల్ కాంపన్సేటరీ అలవెన్స్ – 30శాతం. దివ్యాంగ ఉద్యోగులకు ఇచ్చే కన్వీనియన్స్ అలవెన్స్ రూ. 2000 నుంచి రూ. 3000కు పెంపు. ఇళ్లు నిర్మించుకునే ఉద్యోగులకు ఇచ్చే అడ్వాన్స్ పరిమితిని రూ. 20 లక్షల నుంచి రూ. 30లక్షలకు పెంచుతూ నిర్ణయం. కారు కొనుగోలు చేసే వారికి ఇచ్చే అడ్వాన్స్ పరిమితిని రూ. 6 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంపు. మోటార్ సైకిల్ కొనుగోలు చేసే వారికి ఇచ్చే అడ్వాన్స్ రూ.80వేల నుంచి రూ. 1 లక్షకు పెంచుతూ నిర్ణయం. ఉద్యోగుల పిల్లల వివాహాలకు సంబంధించి.. కుమార్తె పెళ్లికి ఇచ్చే అడ్వాన్స్ రూ. 1లక్ష నుంచి రూ. 4 లక్షలకు పెంపు. కుమారుడి పెళ్లికి ఇచ్చే అడ్వాన్స్ రూ. 75వేల నుంచి రూ. 3 లక్షలకు పెరిగింది. స్టేట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ ఉద్యోగులకు ఇచ్చే ఇన్సెంటివ్ – 30శాతం. గ్రేహౌండ్స్, ఇంటిలిజెన్స్, ట్రాఫిక్, సీఐడీ, ఆక్టోపస్, యాంటీ నక్సలైట్ స్క్వాడ్ విభాగాల్లో పని చేసే పోలీసులకు ఇచ్చే స్పెషల్ పేను 2020 పే స్కేల్ ప్రకారం వర్తింపజేయాలని నిర్ణయం. పెన్షనర్లు మరణిస్తే అందించే తక్షణ సాయం రూ. 20 వేల నుంచి రూ. 30వేలకు పెంపు. ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తించే అన్ని విభాగాల్లోని ఉద్యోగులకు అదనంగా 15శాతం స్పెషల్ పే. కొద్దిరోజుల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం 2.73 శాతం డీఏ ప్రకటించింది. తాజాగా మరింత ప్రయోజనం కల్పించేలా ఆదేశాలు జారీ చేయడంపై ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




పధాని నరేంద్ర మోదీ గౌరవార్థం శ్వేతసౌధం ఏర్పాటు చేసిన విందుకు పారిశ్రామిక వేత్తలు, బిలియనీర్లు, టెక్ దిగ్గజాలు, ఫ్యాషన్ ఐకాన్‌లు హాజరయ్యారు. అధ్యక్షుడు జోబైడెన్, ప్రథమ మహిళ జిల్ దాదాపు 400 మంది అతిథులను ఈ విందుకు ఆహ్వానించారు. శ్వేతసౌధం దక్షిణాన ఉన్న లాన్‌లో ప్రత్యేకంగా పెవిలియన్ ఏర్పాటు చేశారు. కొద్దిసేపటి క్రితమే ప్రధాని మోదీ ఈ విందు వద్దకు చేరుకున్నారు. విందు మెనూలో దాదాపు మొత్తం వెజిటేరియన్ వంటకాలే ఉన్నాయి.

ఈ విందులో భారత బిలియనీర్ ముఖేశ్ అంబానీ, ఆనంద్ మహీంద్రా, యాపిల్ సీఈవో టిమ్ కుక్, కార్పొరేట్ దిగ్గజం ఇంద్రానూయి, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ సీఈవో శంతను నారాయణ్ పాల్గొన్నారు. ఈ విందులోని అతిథుల జాబితాలో మానవహక్కుల ఉద్యమకర్త మార్టిన్ లూథర్ కింగ్–3, టెన్నిస్ ఆటగాడు బిల్లీ జేన్ కింగ్, సినీ ప్రముఖుడు నైట్ శ్యామలన్, ఫ్యాషన్ డిజైనర్ రాల్ఫ్ లౌరెన్, వ్యాపారవేత్త ఫ్రాంక్ ఇస్లామ్, గ్రామీ అవార్డు గ్రహీత జాషువా బెల్ తదితరులు ఉన్నారు. ఇక ఇండో–అమెరికన్ చట్టసభ సభ్యులు, రోఖన్నా, ప్రమీలా జయపాల్, బైడెన్ కుటుంబ సభ్యులు హంటర్, యాష్లే, జేమ్స్, నవోమీ బైడెన్ కూడా విందుకు హాజరయ్యారు. చిరుధాన్యాలకు ప్రపంచవ్యాప్త ప్రచారం తెచ్చేందుకు మోదీ చేస్తున్న కృషికి జిల్ బైడెన్ జైకొట్టారు. మోదీ గౌరవార్థం ఏర్పాటు చేసిన అధికారిక విందు మెనూలో చిరుధాన్యాల వంటకాలనూ చేర్చారు.




దిల్లీ: తెలంగాణ నుంచి కేంద్రానికి రూపాయి పోతే 40పైసలే తిరిగి వస్తోందని తెలంగాణ మంత్రి కేటీఆర్ అన్నారు. దిల్లీ పర్యటనలో భాగంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎదుగుతున్న రాష్ట్రానికి సహకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని చెప్పారు. “తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కేంద్రమే చెబుతోంది. సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్ భూముల గురించి కేంద్రానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశాం. రక్షణశాఖ భూములున్నచోట అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. సికింద్రాబాద్‌లో అభివృద్ధి పనులకు సహకరించాలని కోరాం. రక్షణశాఖ ఇచ్చే స్థలాలకు సమానమైన భూమిని మరోచోట ఇస్తాం. కేంద్రం సంబంధిత భూములిస్తే.. ప్రజోపయోగ పనులకు వాడతాం. దీనిపై తొమ్మిదేళ్లుగా కేంద్రాన్ని కోరుతూనే ఉన్నాం.. ఇప్పటికీ ఒప్పుకోలేదు. రాజీవ్ రహదారిపై స్కైవేల నిర్మాణానికి భూములు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం” అని కేటీఆర్ చెప్పారు. మెట్రో రైలు విస్తరణకు కూడా కేంద్రానికి ప్రతిపాదనలు ఇచ్చినట్లు కేటీఆర్ తెలిపారు. కొత్తగా 31కి.మీ. మేర మెట్రోను విస్తరించాలని భావిస్తున్నామన్నారు. “లఖ్‌నవూ, అహ్మదాబాద్‌లో కంటోన్మెంట్ భూములు మెట్రో కోసం ఇచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 10 మెట్రో ప్రాజెక్టులకు సహకరించారు. అహ్మదాబాద్‌కు భారీగా నిధులిచ్చి హైదరాబాద్‌కు ఇవ్వలేదు. ఎంఎంటీఎస్ విస్తరణకు రాష్ట్ర వాటా నిధులు కేటాయించాం. ప్రజారవాణా కోసమే జరుగుతున్న పనులకు కేంద్రం సహకరించాలి. సహకరించకుంటే కేంద్రం వైఖరిని ప్రజల్లో ఎండగడతాం. రాష్ట్రానికి అప్పుగా ఇచ్చిన వాటిని కూడా గొప్పగా చెప్పుకుంటున్నారు” అని కేటీఆర్ విమర్శించారు.

## కాంగ్రెస్‌లో విలీనం వార్తలపై షర్మిల ఫస్ట్ రియాక్షన్ !




హైదరాబాద్: కాంగ్రెస్‌లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ విలీనమంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ అధ్యక్షురాలు షర్మిల స్పందిస్తూ ట్వీట్ చేశారు. “వైఎస్ షర్మిల రెడ్డి తన చివరి శ్వాస వరకు తెలంగాణ బిడ్డగా..తెలంగాణ కొరకు పోరాడుతూనే ఉంటది..

ఊహాజనిత కథలు కల్పిస్తూ, నాకు, తెలంగాణ ప్రజల మధ్య అగాధాన్ని సృష్టించే విఫలయత్నాలు జరుగుతున్నాయి.. పనిలేని, పసలేని దార్శనికులకు నేను చెప్పేది ఒకటే.. నా రాజకీయ భవిత మీద పెట్టే దృష్టిని, సమయాన్ని కేసీఅర్ పాలనపై పెట్టండి.. అన్నివిధాలుగా కేసీఆర్ సర్కారు పాలనలో.. సర్వనాశనమైపోతున్న తెలంగాణ భవితమీద పెట్టండి.. కేసీఆర్ కుటుంబం అవినీతిని ఎండగట్టండి.. నా భవిష్యత్తు తెలంగాణతోనే.. నా ఆరాటం, నా పోరాటం తెలంగాణ కోసమే.. జై తెలంగాణ” అంటూ షర్మిల ట్వీట్ చేశారు.

## ఈరోజే బీజేపీ మంత్రులను కేటీఆర్ కలవడంలో ఆంతర్యమేంటి?



న్యూఢిల్లీ: కేంద్ర మంత్రులను మంత్రి కేటీఆర్ కలవడంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ థాక్రే స్పందించారు. ఈరోజు పాట్నాలో విపక్షాల మీటింగ్ జరుగుతోందని... మరోవైపు ఢిల్లీలో బీజేపీతో బీఆర్ఎస్ నేతలు మంతనాలు జరుపుతున్నారన్నారు. ప్రతిపక్షాల సమావేశం రోజే బీజేపీ మంత్రులను మంత్రి కేటీఆర్ కలవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రమంత్రి అమిత్ షా, మరికొందరిని బీఆర్ఎస్ నేత కేటీఆర్ కలుస్తున్నారన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ కూటమిగా కట్టేందుకు ఢిల్లీలో చర్చలు జరుపుతున్నారని అన్నారు. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. అయితే బీజేపీ, బీఆర్ఎస్ కలిసే ఉన్నాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని.. ఎవరు దాన్ని అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. ఇప్పుడు ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని మాణిక్‌రావ్ థాక్రే పేర్కొన్నారు.

## ఈటల, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి భాజపా అధిష్ఠానం పిలుపు



దిల్లీ: తెలంగాణపై భాజపా అధిష్ఠానం దృష్టి సారించింది. పార్టీలో నెలకొన్న తాజా పరిణామాలపై భాజపా అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా ఆరా తీశారు. ఈ నేపథ్యంలో సీనియర్ నేతలు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని దిల్లీ రావాలని ఆదేశించారు. ఈ మేరకు వీరిద్దరు ఇవాళ లేదా రేపు దిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన పార్టీ కార్యక్రమాలకు పలువురు సీనియర్లు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ భాజపా కాస్త డీలా పడినట్లుగా కనిపిస్తోంది. తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీలో నెలకొన్న స్తబ్దతను తొలగించి.. అసంతృప్త నేతలను బుజ్జగించే పనిపై భాజపా అధిష్ఠానం దృష్టి పెట్టింది. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్టీలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. పార్టీ చేరికల కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఈటల రాజేందర్‌తో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇతర పార్టీలకు వెళ్తున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వీరిని దిల్లీకి రావాలని ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకొంది. కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఈటల, రాజగోపాల్‌రెడ్డితో పాటు పలువురు సీనియర్లను పిలుపించుకొని మాట్లాడాలని నిర్ణయించింది. మొత్తం మీద తెలంగాణ భాజపా నేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరుకు చెక్ పెట్టాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

## ఉత్తమ్ పార్టీ మారుతారన్న ప్రచారాలు అబద్ధం: భట్టి



హైదరాబాద్: ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారాలు అబద్ధమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కొట్టిపారేశారు. పార్టీ కోసం కష్టపడిన ఉత్తమ్‌పై దుష్ప్రచారం చేయొద్దని హితవుపలికారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని పణంగా పెట్టారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు పిల్లర్‌లా ఉన్న నేతలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ కోటను కూల్చే ప్రయత్నం చేస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొన్ని రోజులుగా పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ప్రచారంపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఖండించారు.

## సినీ ప్రముఖులకు డ్రగ్స్ సరఫరా చేశారా?: కేపీ చౌదరిని ప్రశ్నించిన పోలీసులు



హైదరాబాద్: డ్రగ్స్ కేసులో సినీ నిర్మాత కేపీ చౌదరి కస్టడీ పూర్తయింది. రాజేంద్రనగర్ పోలీసులు రెండు రోజులపాటు ఆయన్ను కస్టడీకి తీసుకుని వివిధ అంశాలపై విచారించారు. నైజీరియాకు చెందిన గాబ్రియల్, డ్రగ్స్ సరఫరాదారు చింతా రాకేష్‌తో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీశారు. గోవా, హైదరాబాద్‌లో నిర్వహించిన పార్టీల్లో పాల్గొన్న వారి వివరాలను పోలీసులు సేకరించారు. మొబైల్ కాల్ డేటా, వాట్సప్ చాటింగ్‌ను కేపీ చౌదరి ముందుంచి ఆయన్ను ప్రశ్నించారు. సినీ ప్రముఖులకు డ్రగ్స్ సరఫరా చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మాదకద్రవ్యాల కొనుగోలు, అమ్మకాలపై ప్రశ్నించారు. కస్టడీ పూర్తయిన నేపథ్యంలో కేపీ చౌదరిని కోర్టులో హాజరుపరచనున్నారు.

## డీకే శివకుమార్‌ను కలిసిన ఎంపీ కోమటిరెడ్డి



బెంగళూరు: కర్నాటక పీసీసీ చీఫ్ శివకుమార్‌ను ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిశారు. బెంగళూరులోని కుమారప్ప అతిథిగృహంలో డికేతో కోమటిరెడ్డి భేట అయ్యారు.

ఈ సందర్భంగా కర్నాటక కాంగ్రెస్ విజయంపై డీకేకు కోమటిరెడ్డి అభినందనలు తెలిపారు. ట్రబుల్ షూటర్, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ కీలకంగా వ్యవహరించారు. ముఖ్యంగా పోల్ మేనేజ్మెంట్, మీడియా మేనేజ్మెంట్, పార్టీ అంతర్గత వ్యవహారాలు చక్కదిద్దడం వంటి అనేక అంశాల్లో డీకేకు మంచి పట్టుందని హైకమాండ్ గుర్తించింది. ప్రస్తుతం డిప్యూటీ సీఎం, రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న డీకేకు.. తెలంగాణ కాంగ్రెస్ బాధ్యతలను ఆ పార్టీ అధిష్టానం అప్పగించాలని నిర్ణయించిందని గత కొన్నిరోజులుగా ఇటు మెయిన్‌స్ట్రీమ్ మీడియాలో.. అటు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అంతేకాదు.. కాంగ్రెస్‌లో పరిస్థితులను చక్కబెట్టడానికి డీకే ఇప్పటికే రంగంలోకి దిగేశారని.. పార్టీలో చేరికల నుంచి ట్రబుల్ షూటింగ్ వరకు అన్నీ ఇక ఆయన కనుసన్నల్లోనే జరుగుతాయని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చెప్పుకుంటూ వస్తున్నాయి.

## రాజకీయాల్లో నేడు విచిత్రాలు జరుగుతున్నాయి.. జేపీ నడ్డా

భవానిపట్న(ఒడిశా): బిహార్ రాజధాని పట్నాలో విపక్ష పార్టీలు భేటీ కావడంపై భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పందించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన సమయంలో జైలుకు వెళ్లిన నేతలే ఇప్పుడు ఆమె మనవడు రాహుల్ గాంధీకి ఆహ్వానం పలుకుతున్నారని విమర్శించారు. బిహార్ సీఎం నీతీశ్ కుమార్ ఆధ్వర్యంలో విపక్ష పార్టీల భేటీ జరగ్గా.. ఇందులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఒడిశాలోని కలహండి జిల్లా భవానీపట్నలో జరిగిన బహిరంగ సభలో నడ్డా మాట్లాడుతూ.. విపక్షాల భేటీపై విమర్శల దాడి చేశారు. ఎమర్జెన్సీ సమయంలో విద్యార్థి నేతలుగా ఉన్న లాలూ, నీతీశ్.. జయప్రకాశ్ నారాయణ్ సారథ్యంలో ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాల్గొని అరెస్టయ్యారన్నారు. లాలూప్రసాద్ యాదవ్ 22 నెలలు జైలులో ఉండగా.. నీతీశ్ కూడా 20 నెలల పాటు జైలు శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. రాజకీయాల్లో నేడు విచిత్ర ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో జైలుకు వెళ్లిన నేతలే ఇప్పుడు ఆమె మనవడు రాహుల్ గాంధీతో చేతులు కలుపుతున్నారన్నారని ఆక్షేపించారు. “విపక్షాల భేటీలో పాల్గొనేందుకు ఉద్ధవ్ ఠాక్రే పట్నాకు రావడం చూశా. ఆయన తండ్రి ‘హిందూ హృదయ్ సామ్రాట్’ బాలాసాహెబ్ ఠాక్రే కాంగ్రెస్‌ను ఎప్పుడూ వ్యతిరేకించేవారు. కాంగ్రెస్‌లో చేరడం కంటే ‘దుకాణ్’ (తన పార్టీ శివసేనను ఉద్దేశించి) మూసివేయడం మంచిదని ఓసారి బాలాసాహెబ్ అన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు ఉద్ధవ్ ఠాక్రే ‘దుకాణ్’ను మూసివేస్తున్నారు” అని విమర్శించారు. ప్రపంచ నేతలు ప్రధాని నరేంద్ర మోదీని కీర్తిస్తుంటే కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని మండిపడ్డారు. వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించిన ప్రధాని నరేంద్ర మోదీ.. అభివృద్ధి రాజకీయాలను దేశానికి పరిచయం చేశారన్నారు.

## ఖమ్మంలో విషాదం.. కుమార్తెతో సహా ఉరివేసుకుని దంపతుల ఆత్మహత్య

పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లిలో విషాదం చోటుచేసుకుంది. పాతకారాయిగూడెం శివారు మామిడితోటలో కుమార్తె సహా దంపతులు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లిదండ్రులు కృష్ణయ్య(40), సుహాసిని(35), కుమార్తె అమృత(19)గా పోలీసులు గుర్తించారు. గతకొంతకాలంగా సుహాసిని అరోగ్యం సరిగా ఉండటం లేదు. ఈక్రమంలో మనస్తాపం చెందిన కుటుంబ సభ్యులు.. ఒకేసారి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com